PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 46 | పేజీలు : 8 | శుకవారం 10 జూలై 2026 | వెల : 4/-







## ప్రజల త్యాగాల వల్లే పరిశ్రమలు

- హైదరాబాద్ సేఫ్ ప్లేస్
- అందుకే పెట్టుబడులు వస్తున్నాయి
- ఇండియాస్ నెక్స్ట్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించామని వెల్లడి
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలని పిలుపు
- "ముంబయి, చెన్నై వంటి నగరాలు ముంపు సమస్య ఎదుర్కొంటున్నాయి
- కాలుష్యం, ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు ఈ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.




హైదరాబాద్

ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విషం చిమ్మడం ఆపి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హితవుపలికారు. కాలుష్యపు కోరల నుంచి నగరాన్ని రక్షించేందుకు పరిశ్రమల్ని ఓఆర్ఆర్ వెలుపలకు తరలిస్తామని పునరుద్ఘాటించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శ్రీకారంచుట్టారు. పరిశ్రమల అవసరాలకు అనగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉండాలని సీఎం ఆకాంక్షించారు. భద్రత ఉండే చోటే ఎక్కువ పెట్టుబడులు వస్తాయన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ అందుకు అత్యంత అనుకూల ప్రదేశమని అభివర్ణించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి - మిగతా3లో



## భారతీయ పరిశ్రమలపై చైనా గుత్తాధిపత్యం

- దేశ ప్రయోజనాలను మోదీ తాకట్టు పెట్టారు: ఖర్గే
- భారత్‌లోని కీలక పరిశ్రమలను చైనాకు అప్పగించిన మోదీ
- దేశ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కల్పిస్తున్నారు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర



## పీవోకేలో తీవ్ర ఉద్రిక్తత.. పాకిస్థాన్‌కు 48 గంటల అల్టిమేటం!

- 38 డిమాండ్లు నెరవేర్చకపోతే భారీ నిరసనలని జేఏఏసీ హెచ్చరిక
- కశ్మీరీ శరణార్థుల 12 అసెంబ్లీ సీట్ల రద్దుపై రాజుకున్న వివాదం
- విద్యుత్, పిండి సబ్సిడీ వంటి డిమాండ్లతో నెలలుగా కొనసాగుతున్న ఆందోళనలు
- జులై 27న ఎన్నికల నేపథ్యంలో ముజఫరాబాద్‌కు భారీ మార్చ్‌కు పిలుపు




## తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల మధ్య బంధం మరింత బలపడాలి

- కిమ్స్-నెకా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం
- కిమ్స్, నెకా ఆధ్వర్యంలో ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిపై అవగాహన కార్యక్రమం
- వారి సంప్రదాయాలను గౌరవించాలన్న మహేశ్ భగవత్
- కార్యక్రమంలో అలరించిన బిహు, మణిపురి నృత్యాలు
- ఆకట్టుకున్న సంప్రదాయ వస్త్రధారణ ప్రదర్శన
- ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిపై కిమ్స్ అవగాహన కార్యక్రమం

## ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు



- ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్
- మెల్‌బోర్న్‌లో భారతీయుల సభలో ప్రశంసలు
- భారత్‌తో బంధం మరింత బలపడిందన్న వ్యాఖ్యలు
- 2023 అహ్మదాబాద్ పర్యటనను గుర్తు చేసిన ఆల్బనీస్
- క్లిష్ట పరిస్థితుల్లో ముందు స్పందించేది భారతీయులేనని కితాబు
- భారతీయుల వల్ల ఆస్ట్రేలియా బలమైన దేశంగా మారిందని వ్యాఖ్య

## హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనేది నా డ్రీమ్

- యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమం
- పీటీ ఉషతో కలిసి గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ప్రారంభించిన రేవంత్‌రెడ్డి
- ఖేలో ఇండియన్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న తెలంగాణ
- 2034లో భారత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది



హైదరాబాద్

ఆటల కోసం తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి మహాత్మ గాంధీ నుంచి యంగ్ ఇండియా స్ఫూర్తి పొందామని తెలిపారు. మహాత్మాగాంధీ యంగ్ ఇండియా అనే వార్తా పత్రికను నడిపేవారని గుర్తు చేశారు. పీటీ ఉషతో కలిసి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీని సీఎం ప్రారంభించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన ఈ వేడుకలో స్పోర్ట్స్ - మిగతా3లో

## గొప్పగా ఎదగండి, ఎక్కువ విజయాలు సాధించండి

- మెల్‌బోర్న్‌లో ప్రవాస భారతీయులకు ప్రధాని మోదీ పిలుపు
- ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ
- దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ గమ్యస్థానమన్న మోదీ
- సద్వినియోగం చేసుకోవాలని ఆస్ట్రేలియా సంస్థలకు పిలుపు
- ఇరుదేశాలు విశ్వసనీయ భాగస్వాములుగా ముందుకు సాగాలన్న ప్రధాని






## ఆగస్టు 15లోపు ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తాం

- హైకోర్టుకు వివరించిన ప్రభుత్వం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హైకోర్టులో విచారణ
- ఈ ఏడాది కొత్త అడ్మిషన్లకూ ఫీజు చెల్లిస్తామని వెల్లడి
- ప్రభుత్వ ప్రతిపాదన వ్యతిరేకించిన కళాశాలలు

## రైతులకు భారంగా ఎరువులు



- పెరిగిన ధరలతో అన్నదాతలపై పెట్టుబడి భారం
- ఎరువుల కొరతతో రైతులకు ఇబ్బందులు
- పెరిగిన ఎరువుల ధరతో రైతులపై పెట్టుబడి భారం
- భారీగా పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు
- నానో ఎరువులు వాడాలని అధికారుల సూచన

హైదరాబాద్

యూరియా ధర పెరగలేదు కానీ యాప్ ద్వారా కొనుగోలు చేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. డీఏపీ ధర పెరగలేదు. కానీ కావాల్సిన నిల్వలు లేని కారణంగా ఇతర కాంప్లెక్స్ ఎరువులు వినియోగించక తప్పని పరిస్థితి నెలకొంది. కాంప్లెక్స్ - మిగతా3లో



## హర్మూజ్‌లో ఉద్రిక్తతలు ఉన్నా భారత్‌కు చమురు కొరత లేదు

- కానీ ఎల్‌ఎన్జీ, ఎల్‌పీజీపై ముప్పు!
- హర్మూజ్ జలసంధి ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై తక్కువే
- యథాతథంగా భారత్‌కు ముడి చమురు సరఫరా ఉందన్న కెప్లర్
- గ్యాస్ సరఫరాపై మాత్రం టెన్షన్

నవగీతం
తెలుగు దినపత్రిక

శుక్రవారం
10 జూలై 2026

# భారతీయ పరిశ్రమలపై చైనా గుత్తాధిపత్యం



భారతదేశంలోని అత్యంత కీలకమైన పరిశ్రమలను చైనాకు అప్పగించడం ద్వారా మోదీ సర్కార్ జాతీయ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కీలక రంగాలను చైనాకు అప్పగించి, చైనీయులు మరింతగా వృద్ధి చెందడానికి పలు అవకాశాలు కల్పించిందని విమర్శించారు. చైనా ఇప్పటికీ భారత వ్యూహాత్మక పరిశ్రమలను శాసిస్తోందని ఒక మీడియా ఇచ్చిన రిపోర్టును ఆధారంగా చేసుకొని ఖర్గే, మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అయితే కాంగ్రెస్ చేసిన ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి కానీ, బీజేపీ నుంచి కానీ స్పందన రాకపోవడం గమనార్హం.

ఆరేళ్ల క్రితం గల్వాన్ లోయలో 20 మంది భారత వీర జవాన్లు ప్రాణత్యాగం చేసిన తర్వాత ప్రధాని మోదీ చైనాకు క్లీన్ చిట్ ఇచ్చారని ఖర్గే ఆరోపించారు. "మన వీరజవాన్లు మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించారు. కానీ మోదీ ప్రభుత్వం భారతదేశ ప్రయోజనాలను చైనాకు తాకట్టు పెట్టింది" అని ఖర్గే ఎక్స్? వేదికగా విమర్శలు గుప్పించారు. దేశ భవిష్యత్తును నిర్దేశించాల్సిన మన ఆర్థిక వ్యవస్థలోని అత్యంక కీలక రంగాలు చైనాపై ఆధారపడడం పెరిగిపోయిందని అన్నారు. గల్వాన్ ఘర్షణ తర్వాత చైనా నుంచి దిగుమతులు 2025–26 నాటికి 101.81 శాతం పెరిగిందని, దీని వల్ల భారత వాణిజ్య లోటు 112.1 బిలియన్ డాలర్లకు చేరిందని ఖర్గే తెలిపారు. "భారతదేశం దిగుమతి చేసుకునే యాంటీబయాకిట్స్?లో 86 శాతం చైనా నుంచే రావడం ఆశ్చర్యకరం. 2024–25లో భారతదేశం దిగుమతి చేసుకున్న ఏపీఐ, బల్క్? డ్రగ్?, డ్రగ్ ఇంటర్మీడియట్లలో దాదాపు 74 శాతం చైనా చేతిలోనే ఉన్నాయి" అని ఖర్గే చెప్పారు. ఇక భారత్? దిగుమతి చేసుకునే విద్యుత్ వాహనాల (ఈవీ) విడిభాగాల్లో 66 శాతం ఇప్పటికీ చైనా నుంచే వస్తున్నాయని అన్నారు. భారత ఈవీలకు శక్తినిచ్చే లిథియం–అయాన్? బ్యాటరీల్లో దాదాపు 75 శాతం దిగుమతి అవుతున్నాయని, వాటిలో అత్యధిక భాగం చైనావేనని ఖర్గే చెప్పారు. అలాగే 2025–26లో భారతదేశం దాదాపు 93 శాతం పర్మనెంట్ మాగ్నెట్?లను చైనా నుంచే దిగుమతి చేసుకుందని ఆయన అన్నారు. సౌరశక్తిపై మోదీ ప్రభుత్వం చేస్తున్న డొల్ల ప్రసంగాలు ఒక వైపు ఉంచితే, ఆత్మనిర్భర్? భారత్ కింద మోదీ ప్రోత్సహిస్తామని చెప్పుకుంటున్న ఓ రంగం పూర్తిగా చైనా వశమైందని అన్నారు. చైనా నుంచి దిగుమతి చేసుకున్న అన్?డిప్యూజ్డ్? సిలికాన్? వేఫర్లలో 99 శాతానికి పైగా చైనా సరఫరా చేయడం తీవ్ర దిగ్భ్రాంతికరం. ఇది ఆ రంగాన్ని దాదాపుగా చేక్కించుకోవడమే. ఈ అన్?డిప్యూజ్డ్? సిలికాన్ వేఫర్లే మన సోలార్ సెల్స్?కు ఆధారంగా మారాయని ఖర్గే పేర్కొన్నారు.

**జూలా ఫ్రెండ్ కోసం ఎర్రతివాచీ**

"చైనా నేరుగా అరుణాచల్ ప్రదేశ్?, లద్దాఖ్?లలో చైనా భారత భూభాగంలోకి చొరబడుతోందని ఉందని పౌర సమాజం నివేదికలు చెబుతున్నాయి. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం తన 'జూలా ఫ్రెండ్' కోసం ఎర్ర తివాచీ పరిచింది. భారతదేశ ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్టులకు నాలుగు చైనా కంపెనీలు బిడ్లు వేసేందుకు వీలుగా ఆంక్షలు తొలగించింది" అని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్?కు చైనా సహాయం చేయడం గురించి సాక్ష్యాత్తు డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అంగీకరించారని, అది అధికారికంగా నమోదు కూడా అయ్యిందని ఖర్గే అన్నారు. అయినా సరే గల్వాన్ ఘటన తర్వాత భారత్?లోని అత్యంత కీలకమైన పరిశ్రమలను బీజింగ్? చేజిక్కించుకోవడానికి అనుమతించడం ద్వారా మోదీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను దెబ్బతీసిందని ఆయన అన్నారు. ఇప్పుడు వారు తన రంగు పులుముకున్న లాల్? ఆంఖ్? (నల్లని కంటి) నీడలో చైనీయులు వృద్ధి చెందడానికి మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నారని మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# గొప్పగా ఎదగండి, ఎక్కువ విజయాలు సాధించండి



'గొప్పగా ఎదగండి, ఎక్కువ విజయాలు సాధించండి' అంటూ మెల్‌బోర్న్‌లోని ప్రవాస భారతీయులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఒక లక్ష్యం పూర్తయితే మరో సంకల్పం తీసుకని ముందుకెళ్లాలని తెలిపారు. ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థతో భారత్? వేగంగా అడుగులో వేస్తోందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ఎదుగుతుందని పేర్కొన్నారు. చంద్రయాన్ ద్వారా తొలిసారి చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టామని, అంతరిక్షంలోకి గగన్‌యాన్ పంపేందుకు భారత్ సిద్ధమవుతోందని తెలిపారు. అలాగే, భారత్ సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధమవుతోందని మోదీ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన మెల్?బోర్న్?లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు ప్రసంగించారు.

"భారత్‌లో హైడ్రో ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్, సోలార్ మాడ్యూల్స్, విండ్ మిల్స్ కోసం మేము ఒక బలమైన మ్యాన్?ఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్‌ను తీర్చిదిద్దుతున్నాం. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, 2070 నాటికి 'నెట్ జీరో' ఉద్గారాలను సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన సాంకేతికత, పెట్టుబడులు, వనరులు ఈ పరివర్తనను మరింత వేగవంతం చేయగలవు. కొన్ని నెలల క్రితమే శాంతియుత ప్రయోజనాల చట్టం ద్వారా భారత్ అణు రంగాన్ని ప్రైవేట్ కంపెనీలకు కూడా భారత్ అందుబాటులోకి తెచ్చింది. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆస్ట్రేలియాలో ఉన్న అపారమైన యురేనియం నిల్వలు భారత్ అణు ఇంధన ప్రయాణంతో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్నాయి."

**'భారత్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయి'**

దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ గమ్యస్థానమని, భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా వ్యాపారవేత్తలను మోదీ కోరారు. భారత్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇండోనేసియా పర్యటన ముగించుకొని ప్రధాని మోదీ ఆస్ట్రేలియా వెళ్లారు. మెల్‌బోర్న్‌కు చేరుకున్న ప్రధానికి అక్కడి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం పలికారు. ఇరు దేశాల ఉమ్మడి వారసత్వాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రధాని వీక్షించారు. తర్వాత మెల్‌బోర్న్‌లో జరిగిన ఆసీస్‌లో ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఆస్ట్రేలియా–ఇండియా సీఈఓ ఫోరమ్ సదస్సులో పాల్గొన్నారు. విమాన, రవాణా, లాజిస్టిక్స్, ఆర్థిక సేవలు, కీలక ఖనిజాలు, టెక్నాలజీ, ఆహార భద్రత వంటి రంగాల్లో ఉన్న అవకాశాలను సీఈఓలతో మోదీ చర్చించారు. ఈ సందర్భంగా అల్బనీస్, మోదీ సరదాగా సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం మాట్లాడిన ప్రధాని ద్వైపాక్షిక వాణిజ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చే ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందాన్ని త్వరగా ఖరారు చేయాలని ఆల్బనీస్‌ను కోరారు. భారత్, ఆస్ట్రేలియాలు సహజమైన, విశ్వసనీయ భాగస్వాములుగా ముందుకు సాగడం ఎంతైనా అవసరం ఉందన్నారు.

**'భారత్, ఆస్ట్రేలియా సంబంధాలు బలపడ్డాయి'**

ఇదిలా ఉండగా, గత 12 ఏళ్లలో తాను ఆస్ట్రేలియాలో పర్యటించడం ఇది మూడోసారని మోదీ తెలిపారు. గడిచిన కాలంలో భారత్–ఆస్ట్రేలియా సంబంధాలు గొప్ప శిఖరాలకు చేరుకున్నాయని, ఇందులో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రవాస భారతీయుల దినచర్య వారిని భారతదేశంతో అనుసంధానించి ఉంచుతుందని, అలాగే వారు ఆస్ట్రేలియా అభివృద్ధికి కూడా దోహదపడుతున్నారని కొనియాడారు. "ఈ కార్యక్రమం హౌస్‌ఫుల్ అయింది. ఇది ఒక బ్లాక్‌బస్టర్. దీనికి ముందు, నేను సిడ్నీలో మీ అందరినీ రెండుసార్లు కలిశాను. నేను మెల్?బోర్న్ ప్రజలను కలవడానికి కూడా ఎదురుచూస్తున్నాను. అందుకే ఈసారి మెల్?బోర్న్ ప్రజలతో కలిసి ఫ్లాట్ వైట్ కాఫీ తాగాలని అనుకున్నాను. ఇక్కడ మీ అందరినీ చూసి నాకు గర్వంగా ఉంది. ఆస్ట్రేలియా అభివృద్ధికి పూర్తి శక్తితో తోడ్పడుతున్నారు. మనం భారతీయులం, పాలలో కరిగే చక్కెరలాంటి వాళ్లం. అది పాలను మరింత మధురంగా ??చేస్తుంది. మన ప్రేమ సారాన్ని ప్రపంచంలోకి నిరంతరం పంచుతూనే ఉంటాం. ఇంట్లో పాలు ఆస్ట్రేలియన్ కావచ్చు, కానీ తయారుచేసే టీ మాత్రం భారతీయమైనది. పప్పులు, కూరగాయలు ఆస్ట్రేలి యన్వే అయినప్పటికీ వాటికి అసలైన భారతీయ మసాలాలతో తాలింపు వేస్తాం" అని మోదీ పేర్కొన్నారు.

మెల్‌బోర్న్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భారతీయ స్ఫూర్తితో నిండిన అనేక ప్రదేశాలు, మార్కెట్లు ఉన్నాయని, కొందరు వాటిని 'లిటిల్ ఇండియా' అని పిలిస్తే, మరికొందరు 'మినీ ఇండియా' అని పిలుస్తారని మోదీ పేర్కొన్నారు. పేరు ఏదైనప్పటికీ, అవి భారతీయ సంస్కృతిలో పూర్తిగా అనుసంధానమై ఉంటాయని, అక్కడ అమ్మకాలు నిరంతరం జరుగుతూ ఉంటాయని చెప్పారు. అంతేకాదు, ఈ అమ్మకాల కొనుగోలు చేయడంలో ప్రజలు ఆసక్తి కనబరుస్తారని తెలిపారు. ఒకవేళ షాపింగ్ చేయాలనే మూడ్ లేకపోయినా, చివరికి ఏదో ఒకటి కొనేస్తారని చెప్పారు.

# హర్మూజ్‌లో ఉద్రిక్తతలు ఉన్నా భారత్‌కు చమురు కొరత లేదు



పశ్చిమాసియాలోని హర్మజ్ జలసంధి వద్ద కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను ఆందోళనకు గురిచేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇలా ఉన్నా భారత్‌కు ముడి చమురు సరఫరాపై తక్షణ ప్రభావం ఉండే అవకాశం తక్కువగా ఉందని అంతర్జాతీయ ఇంధన మార్కెట్ విశ్లేషణ సంస్థ కెప్లర్ వెల్లడించింది. అయితే ఈ పరిస్థితులు ఎక్కువ కాలం కొనసాగితే మాత్రం ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ సరఫరాలు, రవాణా వ్యయాలు, బీమా ఖర్చులపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణపై తాజాగా చేసిన వ్యాఖ్యల అనంతరం పశ్చిమాసియాలో ఘర్షణలు చెలరేగాయి. దీంతో ప్రపంచం లోనే అత్యంత రద్దీగా ఉండే ఇంధన రవాణా మార్గమైన హర్మజ్ జలసంధి భద్రతపై ఆందోళనలు పెరిగాయి. అయినప్పటికీ భారత్ గత కొన్నేళ్లుగా ముడి చమురు కొనుగోలు వనరుల్ని విస్తరించుకున్న క్రమంలో ప్రస్తుతం సరఫరాపై పెద్దగా ప్రభావం లేదని కెప్లర్ విశ్లేషకుడు సుమిత్ రిటోలియా తెలిపారు. భారత క్రూడాయిల్ దిగుమతులకు ఎలాంటి ఆటంకం లేదని, దేశీయ రిఫైనరీలకు చమురు సరఫరా యథాతథంగానే కొనసాగుతోందని అన్నారు.

**సగానికిపైగా క్రూడ్ రష్యా నుంచే**

సుమిత్ రిటోలియా వివరాల ప్రకారం– రష్యా ఇప్పటికీ భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా ఉంది. ఇదే సమయంలో సౌదీ అరేబియా, యూఏఈ నుంచి ప్రత్యామ్నాయ మౌలిక వసతుల ద్వారా చమురు సరఫరా కొనసాగుతోంది. ఇంకా పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుంచి కూడా దిగుమతులు పెరగడంతో భారత్ గతంలో మాదిరిగా ఒకే ప్రాంతంపై ఆధారపడే పరిస్థితి తగ్గింది. దీంతో సరఫరా వ్యవస్థ మరింత బలపడిందని ఆయన చెప్పారు. ఈ వ్యూహం ఫలితంగానే 2026 జూన్ నెలలో భారత్ రికార్డు స్థాయిలో రోజుకు సగటున 4.93 మిలియన్ బ్యారెళ్ల చొప్పున క్రూడాయిల్ దిగుమతి చేసుకుంది. దీంట్లో సుమారు 2.7 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు రష్యా నుంచే వచ్చింది. అంటే మొత్తం క్రూడ్ దిగుమతుల్లో దాదాపు సగానికిపైగా రష్యా వాటానే ఉండటం వల్ల, రష్యా భారత్‌కు ప్రధాన ఆయిల్ సరఫరాదారుగా తన స్థానాన్ని మరింత బలపర్చుకుంది.

హర్మజ్ జలసంధి మీదుగా చమురు నౌకల రాకపోకలు ప్రస్తుతం కొనసాగుతున్నప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగితే మాత్రం భారత్‌పై ప్రభావం పడుతుందని కెప్లర్ అంచనా వేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే షిప్పింగ్ ఛార్జీలు, ఇన్సూరెన్స్ ప్రీమియాలు పెరిగే అవకాశం ఉందని స్పష్టం చేసింది. మరోవైపు అమెరికా ఆంక్షలు, వాణిజ్యపరమైన అనిశ్చితి కారణంగా సమీప భవిష్యత్తులో ఇరాన్ చమురు–భారత దిగుమతుల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపించడం లేదని పేర్కొంది. కెప్లర్ విశ్లేషణ ప్రకారం ప్రస్తుతం అసలు ఆందోళన ముడి చమురుపై కాకుండా ాచీ+, ్గా+ పైనే ఉంది. ఈ ఇంధనాలకు తక్షణ ప్రత్యామ్నాయాలు తక్కువగా ఉండటంతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగితే సరఫరా తగ్గడం, రవాణా వ్యయాలు పెరగడం తద్వారా ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని హెచ్చరిక చేసింది.

**పెట్రోల్ ధర తగ్గించాలి– కేజ్రీవాల్ డిమాండ్**

ఇదిలా ఉండగా ఆమ్ ఆద్మీ పార్టీ (ూ్యూ) జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్ ధరల్ని తగ్గించడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధరను రూ. 102 నుంచి రూ. 82 కు తగ్గించాలని, అదే విధంగా డీజిల్ ధరల్ని కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది మే నుంచి ఇవే ధరలు ఉన్నాయని, చమురు కంపెనీలు అక్రమ లాభాల్ని ఆర్జించకూడదని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గితే ద్రవ్యోల్బణం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఇంకా గతంలోనూ అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పలు మార్లు భారీగా తగ్గినా ఆ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించలేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆ లాభాల్ని ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు.

## పీవోకేలో తీవ్ర ఉద్రిక్తత..
## పాకిస్థాన్‌కు 48 గంటల అల్టిమేటం!



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. జమ్ము కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) తమ 38 డిమాండ్లను నెరవేర్చాలంటూ ఇస్లామాబాద్ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధిస్తూ అల్టిమేటం జారీ చేసింది. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే తీవ్రస్థాయిలో తుది దశ పోరాటం చేపడతామని హెచ్చరించింది. ఈ నెల 27న పీఓకేలో ప్రాంతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్‌లో స్థిరపడిన కశ్మీరీ శరణార్థులకు కేటాయించిన 12 అసెంబ్లీ స్థానాలను రద్దు చేయాలనే నిర్ణయం తాజా ఆందోళనలకు ప్రధాన కారణమైంది. ఈ నిర్ణయం ద్వారా పాక్ కేంద్ర ప్రభుత్వం స్థానిక రాజకీయాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటోందని జేఏఏసీ ఆరోపిస్తోంది. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో, ముజఫరాబాద్‌కు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని కమిటీ పిలుపునిచ్చింది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పౌర సమాజం, వాణిజ్య, విద్యార్థి సంఘాలతో 2023లో ఏర్పాటైన జేఏఏసీ, పెరిగిన ధరలు, విద్యుత్ ఛార్జీలు, గోధుమ పిండిపై సబ్సిడీ వంటి డిమాండ్లతో ఈ ఏడాది మే నెలలో చేపట్టిన భారీ నిరసనలతో వెలుగులోకి వచ్చింది. మంగ్లా డ్యామ్ వంటి ప్రాజెక్టుల ద్వారా స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌పై తమకే హక్కులు కల్పించాలని, అలాగే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను రద్దు చేయాలని కమిటీ డిమాండ్ చేస్తోంది. గత కొన్ని వారాలుగా పీఓకేలో బంద్‌లు, ధర్నాలతో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతూ పలువురిని అరెస్ట్ చేసిందని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఆహారం, మందుల కొరత ఏర్పడిందని, తక్షణమే మానవతా సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని 'ఆజాద్ కశ్మీర్' అని పిలుస్తున్నప్పటికీ, ఇక్కడి సహజ వనరులను వాడుకుంటూ తమను ఆర్థికంగా అణచివేస్తోందని స్థానికులు సుదీర్ఘ కాలంగా ఆరోపిస్తున్నారు. కాగా, జమ్ముకశ్మీర్ మొత్తం తమ అంతర్భాగమేనని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిన విషయం విదితమే.

## ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు



ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ ఆస్ట్రేలియాకు నిజమైన మిత్రుడని, తనకు ఎంతో ఆప్తుడని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భారతీయులు హాజరయ్యారు. ఎన్నో చారిత్రక కార్యక్రమాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని, కానీ భారతీయుల ఈ సమావేశం అత్యంత ప్రత్యేకమైందని ఆల్బనీస్ అన్నారు. ఈ సభలో కనిపిస్తున్న ఉత్సాహమే భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానిగా తాను రెండుసార్లు భారత్‌లో పర్యటించే అవకాశం దక్కిందని ఆల్బనీస్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ అందాలు, ప్రజల ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మోదీతో కలిసి రథంలో ప్రయాణించిన అనుభవాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అప్పట్లో గుజరాత్‌లో చూసిన ఆప్యాయత, ఇప్పుడు ఈ సభలోనూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. భారత సంతతి ప్రజలు ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆల్బనీస్ కొనియాడారు. ఆరోగ్యం, ఐటీ వంటి రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని చెప్పారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగా స్పందించి సాయం చేసేది భారతీయులేనని వెల్లడించారు. భారతీయుల వల్ల ఆస్ట్రేలియా మరింత బలమైన, వైవిధ్యభరితమైన దేశంగా మారిందని ఆల్బనీస్ అన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధాన్ని మరింత బలపరిచే సజీవ వారధి భారత సంతతి ప్రజలేనని కొనియాడారు.

## మూలికతో క్యాన్సర్‌కు చెక్
## జంతువులపై ప్రయోగాలు సక్సెస్

ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని నయం చేసే సామర్థ్యం గంధమార్దన్? కొండల్లో లభించే ఒక అరుదైన మూలికకు ఉందని పరిశోధకులు గుర్తించారు. జంతువులపై నిర్వహించిన ప్రయోగాలు ఆశాజనక ఫలితాలు ఇస్తున్నాయని, త్వరలోనే మనుషులపై కూడా ప్రయోగాలు చేయడానికి సిద్ధమవుతున్నాయని వారు చెబుతున్నారు. సంబల్‌పూర్ విశ్వవిద్యాలయానికి చెందిన బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్? విభాగం దీనిపై పరిశోధనలు చేస్తోంది. గత 35 రోజులుగా జంతువులపై చేస్తున్న ప్రయోగాలు అత్యంత ఆశాజనకమైన ఫలితాలు ఇస్తున్నాయి. మరో 90 రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఇవి కనుక విజయవంతమైతే, దేశంలోని సీసీఆర్ఏఎస్ గుర్తింపు పొందిన ఆసుపత్రితో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకొని, ఈ ఔషధాన్ని మనుష్యులపై ప్రయోగించడానికి చర్యలు చేపడతారు. ఆ ప్రక్రియ మరో 9 నెలలపాటు కొనసాగుతుందని అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న క్యాన్సర్ చికిత్సలు చాలా ఖరీదైనవి. ఇవి సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. అందుకే సంబల్‌పూర్ విశ్వవిద్యాలయ పరిశోధకులు గత ఐదేళ్లుగా గంధమార్దన్? కొండల్లో లభించే కొన్ని విశిష్ట ఔషధ మొక్కలపై విస్తృతంగా అధ్యయనం చేశారు. చివరికి ఐదు ప్రధానమైన మూలికలను గుర్తించారు. బార్గఢ్ జిల్లా గంధమార్దన్ కొండల్లో నివసిస్తూ, సంప్రదాయ ఆయుర్వేద పద్ధతులు ఉపయోగించే కొందరు నాటు వైద్యుల సహాయంతో, సంబల్?పూర్? యూనివర్సిటీ బృందం పరిశోధనలు ప్రారంభించింది. నాటు వైద్యులు ఇచ్చిన సమాచారంతో ముందుగా 50 ఔషధ మొక్కలను గుర్తించారు. వాటిలో 5 ఔషధ మొక్కలకు క్యాన్సర్‌తో పోరాడే గుణాలు ఉన్నట్లు శాస్త్రీయంగా నిర్ధరించుకున్నారు. మొదటిగా ఎలుకలపై ఈ మూలికలు వాడి పరిశోధనలు ప్రారంభించామని సంబల్‌పూర్ వర్సిటీ బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ నాయక్ తెలిపారు. ఇప్పటి వరకు చేసిన పరిశోధనల్లో చాలా ఆశాజనకమైన ఫలితాలు వచ్చాయని ఆయన చెప్పారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
10 జూలై 2026

# హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనేది నా డ్రీమ్

-మొదటిపేజీ తరువాయి

వర్సిటీ వెబ్‌సైట్, లోగోను పీటీ ఉషతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 8వ ఖేలో ఇండియన్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రభుత్వ విధానాలే స్పోర్ట్స్‌లో దేశ దుస్థితికి కారణమని, అందుకే క్రీడాకారులను సరైన దిశలో నడిపించడానికి స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. 1990-2004 మధ్య హైదరాబాద్ చాలా స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు ఆతిథ్యం ఇచ్చిందని, గత 20 ఏళ్లలో తెలంగాణలో ఎలాంటి పెద్ద స్పోర్ట్స్ ఈవెంట్స్ పెట్టలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనేది తమ డ్రీమ్ అని, 2034లో భారత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుందని, దానికి హైదరాబాద్ వేదిక కావాలని కోరుకుంటున్నానని వెల్లడించారు.

**దేశానికి సరైన గుర్తింపు రావట్లేదు**

ఒలింపిక్స్ పతకాల్లో భారత్ ఎప్పుడూ చివరనే ఉంటుందన్న సీఎం కొంతమంది ఒలింపిక్స్, ఇతర గేమ్స్‌లో రాణించినా దేశానికి సరైన గుర్తింపు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలే స్పోర్ట్స్‌లో దేశ దుస్థితికి కారణమని విమర్శించారు. క్రీడాకారులను సరైన దిశలో నడిపించడానికే స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని, క్రీడలను ప్రోత్సహించడానికే స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని పేర్కొన్నారు.
పీటీ ఉష మనందరికి స్ఫూర్తి అని, పీటీ ఉష ఆటల్లో, రాజకీయాల్లో, కెరియర్‌లో అందరికీ స్ఫూర్తి అని రేవంత్ రెడ్డి తెలిపారు. 2018 ఓటమి తర్వాత రేవంత్ రెడ్డి పనైపోయిందని అన్నారని, కానీ లోక్‌సభ ఎన్నికల్లో అతి పెద్ద నియోజకవర్గం నుంచి గెలిచానని, తర్వాత పార్టీ అధ్యక్షుడిని, సీఎం అయ్యానని గుర్తు చేశారు. నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు



ఆతిథ్యం ఇస్తున్నామని, చదువుకుంటే ఉద్యోగం వస్తుందో లేదో తెలియదని, ఆటలు ఆడితే మాత్రం కచ్చితంగా ఉద్యోగం వస్తుందని పేర్కొన్నారు. "ఆటల కోసం తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసింది. మహాత్మ గాంధీ నుంచి యంగ్ ఇండియా స్ఫూర్తి పొందాం. మహాత్మాగాంధీ యంగ్ ఇండియా అనే వార్తా పత్రికను నడిపేవారు. 1990-2004 మధ్య హైదరాబాద్ చాలా స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. గత 20 ఏళ్లలో తెలంగాణలో ఎలాంటి పెద్ద స్పోర్ట్స్ ఈవెంట్స్ పెట్టలేదు. హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనేది నా డ్రీమ్. 2034లో భారత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. దానికి హైదరాబాద్ వేదిక కావాలని కోరుకుంటున్నా"

**ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడుతుంది**

స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని పీటీ ఉష తెలిపారు. స్పోర్ట్స్ వర్సిటీ యువ ఆటగాళ్ల ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. పెద్ద కల కనండి, కష్టపడండి, సాధించండని పేర్కొన్నారు.

# తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల మధ్య బంధం మరింత బలపడాలి

తెలంగాణకు, ఈశాన్య రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వ బంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ లా అండ్ ఆర్డర్ డీజీపీ ఎం.మహేశ్? భగవత్ అన్నారు. కిమ్స్ హాస్పిటల్స్, నార్త్-ఈస్ట్ కనెక్ట్ అసోసియేషన్ (నెకా) సంయుక్తంగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్స్‌లో ఇవాళ నిర్వహించిన 'ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి అవగాహన కార్యక్రమం'లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, భాషల గురించి సమగ్ర అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని డీజీపీ భగవత్ వ్యాఖ్యానించారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన అనేక మంది తెలంగాణలో, అందులోనూ ముఖ్యంగా హైదరాబాద్‌లో విద్య, ఉద్యోగాలు, వైద్య రంగాల్లో సేవలందిస్తున్నారన్నారు. వారి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన వివరించారు.

**ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాధరణలో యువతులు**

"భారతదేశ వైవిధ్యాన్ని దగ్గర చేయడం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల పట్ల పరస్పర అవగాహన, గౌరవాన్ని పెంపొందించడం, సమ్మిళిత సమాజ నిర్మాణానికి తోడ్పడడమే నెకా ముఖ్య లక్ష్యం"

**అలరించే సంప్రదాయ నృత్యాలతో**

తమ ఆసుపత్రుల్లో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన అనేక మంది నర్సింగ్, పారామెడికల్‌తో పాటు ఇతర విభాగాల్లో సేవలందిస్తున్నారని కిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ డా.బి.భాస్కరరావు




తెలిపారు. వారి ప్రత్యేక సంస్కృతి, జీవన విధానాన్ని అర్థం చేసుకుని, వారికి మరింత ఆత్మీయమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. అస్సాం సంప్రదాయ బిహు నృత్యం, ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణ ప్రదర్శన, మణిపురి నృత్యం ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**వేడుకకు హాజరైన ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) ప్రొఫెసర్ అజైలియు నియుమై ఈశాన్య రాష్ట్రాల సామాజిక, సాంస్కృతిక విశిష్టత గురించి వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ ఎం.సోమశేఖర్ కూడా ప్రసంగించారు. ఈ వేడుకల్లో నెకా అధ్యక్షుడు పాపారావు బియ్యాల, ఉపాధ్యక్షుడు గౌతమ్ సవాంగ్, కోశాధికారి అడ్వొకేట్ స్టీఫెన్ రోనోజిత్ సేన్, బోర్డు సభ్యులు డా. కె. రాజేశ్వరరావు, శ్రీధర్ ముప్పిడి, కిమ్స్ మెడికల్ ఆపరేషన్స్ డైరెక్టర్ డా.సంబిత్ సాహు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోపు ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తాం

ఆగస్టు 15వ తేదీలోపు ఈ ఏడాదికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. 2, 3, 4వ సంవత్సరం విద్యార్థులకూ ఫీజు చెల్లిస్తామని పేర్కొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్?మెంట్ చెల్లించడం లేదంటూ పలు ఇంజినీరింగ్ కళాశాలలు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.
ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హైకోర్టులో విచారణ సందర్భంగా ప్రభుత్వ ప్రతిపాదనను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఆ బకాయిలు దాదాపు రూ.10 వేల కోట్లు ఉంటుందన్నారు. 2023 నుంచి ఉన్న పెండింగ్‌ల బకాయిలు వెంటనే చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. తర్వాత కొంత గడువుతో మిగతా బకాయిలు చెల్లించేలా చూడాలని హైకోర్టును కోరారు. గత విచారణలో జీవో9లో నాలుగు నిబంధనలపై షరతు విధించింది. అందులో కొన్ని నిబంధలపై విధించిన స్టే ఎత్తివేయాలని ప్రభుత్వం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. స్టే వల్ల కొత్తగా చేరిన విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది.

**అసలేం జరిగిందంటే?**

ఇంజినీరింగ్ ప్రవేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన




విషయం తెలిసిందే. దీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతోపాటు, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఫీజులను విద్యార్థుల అకౌంట్లలో వేస్తామంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సవాలు చేస్తూ పలు కళాశాలలు పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిపై విచారణ చేపట్టిన హైకోర్టు విద్యార్థుల నుంచి కళాశాలలు ఫీజులు వసూలు చేసుకోవచ్చంటూ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను తొలగించాలని కోరుతూ ప్రభుత్వం పిటిషన్?ను దాఖలు చేసింది. వీటిపై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి బుధవారం మరోసారి విచారణ చేపట్టారు.
పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయవద్దంటూనే గడువు కోరుతున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఫీజులు విద్యార్థుల అకౌంట్లలో జమయ్యాక వారు చెల్లించకపోతే బకాయిల బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందో లేదో చెప్పాలని వారు ప్రశ్నించారు. రూ.2,800 కోట్ల బకాయి ఉండగా రూ.250 కోట్లు మాత్రమే కేటాయింపు చేశారని పేర్కొన్నారు. గత బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారన్నదానిపై స్పష్టత ఇవ్వడంలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ అడ్మిషన్లు ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. ఫీజు చెల్లించనట్లయితే అడ్మిషన్‌లను కాలేజీలు నిరాకరిస్తున్నాయని హైకోర్టుకు వివరించారు. మధ్యంతర ఉత్తర్వుల కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు చెల్లించలేక నష్టపోయే ప్రమాదం ఉందని వాదనలు వినిపించారు.

## ప్రజల త్యాగాల వల్లే పరిశ్రమలు

-మొదటిపేజీ తరువాయి

శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయని అభినందించారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందు ఉన్నప్పటికీ కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయని వాటి శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలతో ముందుకెళుతోందని సీఎం వివరించారు.

**ప్రజల త్యాగాల వల్లే పరిశ్రమలు**

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతీ సంవత్సరం 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారన్న ఆయన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలని కోరారు. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని వెల్లడించారు.

**హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది**

గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్‌ఆర్, పరిశ్రమలు వచ్చాయని సీఎం కొనియాడారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుందని, అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని, అందుకే సిటీలో ఉన్న పరిశ్రమలను ఓఆర్‌ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. "ముంబయి, చెన్నై వంటి నగరాలు ముంపు సమస్య ఎదుర్కొంటున్నాయి. కాలుష్యం, ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు ఈ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఓఆర్‌ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్‌ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫాక్చరింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నాం. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థికవ్యవస్థగా ఎదుగుతుంది. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పుతున్నాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటికి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉండాలి"

**ఏడాదిలోనే పరిశ్రమ**

పెట్టుబడులతో పాటు ఆవిష్కరణలు, ఉత్పత్తిని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీలో పాలసీనే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని స్పష్టం చేశారు. 75 ఎకరాల్లో కేవలం ఏడాదిలోనే పరిశ్రమ నెలకొల్పడం పట్ల ప్రీమియర్ ఎనర్జీస్ యాజమాన్యాన్ని అభినందించిన సీఎం స్థానికులకు ప్రాధాన్యం ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు.

## రైతులకు భారంగా ఎరువులు

-మొదటిపేజీ తరువాయి

ఎరువులైనా సరైన ధరకు దొరుకుతున్నాయా అంటే గతేడాదితో పోల్చితే ఎరువుల ధరలు రూ.300 నుంచి రూ.800 వరకు పెరిగాయి. పెరిగిన ఎరువుల ధరలతో రైతులకు పెట్టుబడి భారం కానుంది. ఎరువులకే 40 నుంచి 50 శాతం మేర ఖర్చు చేయాల్సి వస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పెరిగిన ఎరువుల ధరలపై ప్రభావం రైతులపై ఎలా పడుతుందో తెలుసుకుందాం.

**పెరిగిన ఎరువుల ధరతో రైతులపై పెట్టుబడి భారం**

డీఏపీ, యూరియా తప్ప మిగిలిన అన్ని కాంప్లెక్స్ ఎరువుల ధర రూ.300 - రూ.800 వరకు పెరిగాయి. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ముడి సరకు రాక ఎరువుల ఉత్పత్తి నిలిచిపోయి పలు కంపెనీలు మూతపడ్డాయి. కాంప్లెక్స్ ఎరువులతో పాటు పొటాష్?? ధర రూ.1,800 - రూ.2,100, సింగిల్ సూపర్ పాస్పేట్ ధర రూ.650 - రూ.775కు పెరిగింది. పలుచోట్ల కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తేనే డీఏపీ అమ్ముతామని దుకాణదారులు ఆంక్షలు పెడుతున్నారు. దీంతో రైతులకు ఎరువులపై పెట్టుబడి శాతం పెరగనుంది. డీఏపీ మందు బస్తాలు గతంలో అన్ని షాపుల్లో విరివిగా దొరికేవి. ఇప్పుడు వీటి కొరత ఏర్పడింది. 2020 బస్తా రూ.2,150 ఉంది. రైతులు చేసే పనులకు అదనపు ఖర్చులే ఎక్కువగా ఉన్నాయి. రైతులందరు ఆన్‌లైన్‌లో యూరియా బుక్? చేసుకోలేకపోతున్నారు.

**అందుబాటులో లేని యూరియా, డీఏపీ ఎరువులు**

డీఏపీ, యూరియా ధరలు పెంచకుండా కేంద్రం రాయితీని కొనసాగించడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. కానీ డీఏపీ సరిపడా నిల్వలు లేవు. ఇతర కాంప్లెక్స్ ఎరువులను తప్పక కొనుగోలు చేయాల్సి వస్తోంది. పెరిగిన ధరలు భారంగా మారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో సుమారు 13 లక్షల ఎకరాలు, యాసంగిలో 10 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. కాంప్లెక్స్ ఎరువుల ధరల మోతతో చాలా మంది రైతులు తక్కువ ధరకు వచ్చే యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో నత్రజని శాతం పెరిగి పంటలకు చీడపీడలు సోకి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎరువుల పెట్టుబడి పెరుగుతున్న నేపథ్యంలో నానో ఎరువులు వాడటం ద్వారా పెట్టుబడి భారం తగ్గుతుందని, తద్వారా నేలసారం దెబ్బతినకుండా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

## మెట్రో ముందుకు సాగనివ్వండి..

**హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-ఎఎ విస్తరణ పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్-ఎను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు- గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ రెడ్డి విడివిడిగా లేఖలు రాసి పంపారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.గత సమావేశాల నిర్ణయాల ప్రకారం.. మెట్రో ఫేజ్-ఎ ఆస్తుల విలువను నిర్ధారించడం, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణ బాధ్యతలతో పాటు, హైదరాబాద్ మెట్రో ఫేజ్-ఎఎ విస్తరణకు అవసరమైన దీర్ఘకాలిక ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఎస్‌బీఐ క్యాప్స్ ను నియమించాలని ఉమ్మడిగా అంగీకరించారు. అయితే, ఈ విషయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ను ఖరారు చేయకపోవడం, ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించడంలో జాప్యం జరగడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ జాప్యం వల్ల హైదరాబాద్ మెట్రో ఫేజ్-ఎ నిర్వహణలో రోజువారీ ఇబ్బందులు, అనిశ్చితి ఎదురవుతున్నాయని, అలాగే ఫేజ్-ఎఎ డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయని తన లేఖల్లో రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఫలితంగా ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలకు అత్యంత కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్-ఎఎ విస్తరణ పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఈ విషయంలో ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌లు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కోరారు.జూన్ నెలలో 23న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. ఈ భేటీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెట్రో ఫేజ్-1 ఆస్తుల విలువ నిర్ధారణ (వాల్యుయేషన్), స్వాధీనానికి అవసరమైన లోన్ సేకరణ, రుణ సంస్థ ఎంపికతో పాటు, ఫేజ్-2 విస్తరణకు అయ్యే నిర్మాణ వ్యయం, దీర్ఘకాలిక రుణాల సేకరణపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఒక ప్రత్యేక కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడిగా ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ నిర్ణయంతో మెట్రో విస్తరణ, స్వాధీన ప్రక్రియలకు ఉన్న ఆటంకాలు తొలిగిపోయాయి.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
10 జూలై 2026

# సంపాదకీయం

## వయనాడ్‌కు ఈ పరిస్థితి ఎందుకు?

కేరళలో ప్రకృతి ప్రకోపానికి శవాల దిబ్బగా మారిన ప్రాంతాల్లో.. అన్వేషణ, సహాయక చర్యలు యుద్ధప్రాతిపదినక కొనసాగు తున్నాయి. బురద, శిథిలాల నుంచి భారీగా మృతదేహాలు బయటపడుతున్నాయి.: వయనాడ్ పశ్చిమ కనుమల అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థలో ఉంది. ఇక్కడి శిలలు ప్రీకాంబ్రియన్ యుగం నాటి గ్నైస్, స్కిస్ట్ రకానికి చెందినవి, ఇవి చాలా పెళుసుగా ఉంటాయి. ఈ శిలలలో సహజ పగుళ్లు ఉంటాయి, ఇవి వర్షపు నీరు పడ్డ తర్వాత బలహీనమవుతాయి. 2024 కొండచరియ విపత్తుకు ముందు 48 గంటల్లో, 572.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది, ఇది ఐఎండి అంచనా కంటే 200 శాతం ఎక్కువ. వయనాడ్‌లోని వైతిరి తాలూకాను పశ్చిమ కనుమల పర్యావరణవేత్తల ప్యానెల్ పర్యావరణ సున్నిత జోన్-1గా ప్రకటించినప్పటికీ, అభివృద్ధి పనులు ఆగకుండా కొనసాగాయి.హెచ్చరికలను పట్టించుకోలేదు: 2011లో, మాధవ్ గాడ్గిల్ కమిటీ పశ్చిమ కనుమలలోని సున్నితమైన ప్రాంతాల్లో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మైనింగ్‌పై తాత్కాలిక నిషేధాన్ని సిఫార్సు చేసింది. కేరళ ప్రభుత్వం ఆ నివేదికను పక్కన పెట్టింది. 2024 కొండచరియ విపత్తుకు 16 గంటల ముందు హ్యూమ్ సెంటర్ ఫర్ ఎకాలజీ ఒక హెచ్చరిక జారీ చేసింది, కానీ అది అధికారిక వ్యవస్థలో భాగం కానందున జిల్లా యంత్రాంగం దానిని విస్మరించింది. కేంద్ర ప్రభుత్వం కూడా జూలై 23, 24, 25, 26 తేదీలలో భారీ వర్షాలు, కొండచరియ విపత్తుల గురించి హెచ్చరికలు జారీ చేసింది, కానీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. అభివృద్ధి పరుగులో పర్యావరణ నిర్లక్ష్యం: గత కొన్నేళ్లుగా వయనాడ్‌లో రిసార్ట్‌లు, రోడ్లు, పర్యాటక సౌకర్యాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. చెట్ల స్థానంలో కాంక్రీట్ కట్టడాలు వచ్చాయి. వర్షపు నీటి తీసుకునే భూమి తగ్గిపోయింది, అస్థిరమైన వాలులపై ఒత్తిడి పెరిగింది. సెప్టెంబర్ 2025 నాటి నివేదిక ప్రకారం, "వయనాడ్ కొండచరియ విపత్తు ప్రకృతి చర్య కాదు, అది మానవుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యం ప్రత్యక్ష ఫలితం." అని తేలింది. శిథిలాల కింద ప్రాణాలతో ఉన్నవారికోసం..రెస్క్యూ బృందాలు గాలిస్తున్నాయి. మరోవైపు ఈ జల ప్రళయానికి.. మానవుడి అత్యాశ, ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమంటున్నారు..పర్యావరణ వేత్తలు. కేరళలో విరిగిపడుతున్న కొండచరియలు.. ఊళ్లకు ఊళ్లనే నాశనం చేశాయి. వాయనాడ్‌లో ఇటీవల సంభవించిన ఘటనలో 295 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా..అనేక మంది ఆ శిథిలాల కిందే చిక్కుకుపోయారు. కనీవినీ ఎరుగని ఈ విపత్తుకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ విడుదల చేసింది. అక్కడ సంభవించిన విలయాన్ని 3డీ రూపంలో చూపించింది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 86వేల చదరపు మీటర్ల భూభాగం జారిపడిపోయినట్లు ఇస్రో అంచనా వేసింది. సముద్రమట్టానికి 1,550 మీటర్ల ఎత్తులో ఈ కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని గుర్తించింది. వాయనాడ్‌లో చోటుచేసుకున్న భారీ వినాశనాన్ని అంచనా వేసేందుకు..కార్టోశాట్-3 శాటిలైట్‌తో పాటు ఆ ప్రాంతంలో అంతరిక్షం నుంచి తీసిన 3డీ చిత్రాలను ఇస్రో విశ్లేషించింది. గతంలోనూ అదే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన విషయాన్ని ఈ చిత్రాల్లో వివరించింది. కేరళలో గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు వాయనాడ్ ప్రాంతం మొత్తం తడిగా మారిపోయిందని నిపుణులు చెబుతున్నారు.వాయనాడ్ జిల్లాలో ప్రకృతి సృష్టించిన విపత్తు ఎన్నో కుటుంబాలను చిదిమేసింది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి గ్రామాలను నేలమట్టం చేసిన ఘటనలో..మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడటంతో మండక్కై, చూరాల్‌మల ప్రాంతాలు నామరూపాల్లేకుండా ధ్వంసమైపోయాయి. ముండక్కైలో 150 వరకు ఇళ్లు ఉండగా.. వాటిల్లో 65 పూర్తిస్థాయిలో నేలమట్టమయ్యాయి. శిథిలాలను తొలగిస్తే గానీ లోపల ఎంత మంది ఉన్నారనేది తెలియదని సహాయక బృందాలు చెబుతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. యుద్ధప్రాతిపదికన రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన భారత సైన్యం దాదాపు వెయ్యిమందికిపైగా స్థానికులను సురక్షితంగా కాపాడింది. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల నుంచి ప్రజలను రక్షించేందుకు సహాయక బృందాలు తాత్కాలిక వంతెనలను నిర్మించారు. రోడ్డు మార్గాలు ధ్వంసమై రాకపోకలకు వీలులేని ప్రాంతాల నుంచి వీటి ద్వారా ప్రజలను తరలిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఉపయోగించిన వీటిని.. బెయిలీ వంతెనలంటారు.వాయనాడ్‌లోని బాధిత ప్రాంతాల్లో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పర్యటించారు. కొండచరియలు విరిగిపడ్డ చురాల్‌మాల ప్రాంతాన్ని పరిశీలించారు. సహాయక చర్యలపై ఆరాతీశారు. రాహుల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీ , నేతలు కూడా కొండచరియలు విరిగిపడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. బాధితులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా కేరళ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు రాహుల్‌గాంధీ. కేంద్రం కూడా కేరళకు అండగా ఉండాలన్నారు. సహాయక శిబిరాల్లో ఉన్న వరదబాధితులను కూడా కలిశారు..రాహుల్ , ప్రియాంక. అటు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా వయనాడ్ వెళ్లి విపత్తు పరిస్థితిపై సమీక్షించారు.మరోవైపు మానవ చర్యల వల్లే కేరళలో తరచూ ఇలాంటి ప్రకృతి విపత్తులు జరుగుతున్నాయంటున్నారు..పర్యావరణ వేత్తలు. కేరళకు పశ్చిమాన అరేబియా సముద్రంతో పాటు తూర్పున విస్తారమైన పశ్చిమ కనుమలు.. విస్తరించి ఉన్నాయి. వీటిని ఆస్వాదించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. దాంతో ఎకో టూరిజం పేరుతో హోటళ్లు, రిసార్టుల నిర్మాణం భారీగా జరుగుతోంది. ఇందుకోసం అడవులను కూడా విచ్చలవిడిగా నరికేస్తున్నారు. పర్యావరణపరంగా అత్యంత సున్నిత ప్రాంతమైన పశ్చిమ కనుమలు ఈ పరిణామాలతో తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. 2017, 2018, 2019ల్లో వరుసగా తుఫాన్లు, వరదలు కేరళను ముంచెత్తాయి. ఇప్పుడు వాయనాడ్ విధ్వంసం..కోలుకోలేని దెబ్బతీసింది.కేరళలోని వాయనాడ్, ఇడుక్కి జిల్లాల్లో కొండ ప్రాంతాలపై ఇటీవల నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోవడమే పెను సమస్యగా పరిణమించింది. వేసవిలో తీవ్రమైన ఎండలు, వర్షాకాలంలో మితిమీరిన వానలు పరిపాటిగా మారాయి. దాంతో కొండచరియలు విరిగిపడే ముప్పు నానాటికీ పెరుగుతోంది. బాగా ఎండిన నేలల్లో వాననీరు తక్కువగా ఇంకుతుంది. కొండల పైభాగంలో రాతి శిఖరాలను ఆవరించి ఉండే మట్టి పొరలు వదులుగా ఉంటాయి. భారీ వర్షాలకు తడిసి, వరద ఉధృతికి కొట్టుకుపోతాయి. తాజా విలయమే ఇందుకు ఉదాహరణ. గత ఏడేళ్లలో దేశవ్యాప్తంగా అత్యంత ఎక్కువ సంఖ్యలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు నమోదైంది కేరళలోనే. దేశవ్యాప్తంగా 3 వేల 782 ఘటనలు జరిగితే..వాటిలో కేరళలోనే 2 వేల 239 ఘటనలు జరిగాయి. పర్యావరణ విధ్వంసంపై కేరళ ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే..వయనాడ్ ఘటనలు నిత్యకృత్యంగా మారుతాయని హెచ్చరిస్తున్నారు..పర్యావరణ వేత్తలు.

# బీజేపీకి చెక్ పెట్టేందుకే పీకే ప్లాన్

**పాట్నా :** తెరవెనుక ఉంటూ గొప్ప పొలిటికల్ స్ట్రాటజిస్టుగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ పార్టీ పెట్టి పెద్దగా సక్సెస్ కాలేదు. కానీ ఆయన గత ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ ఇప్పుడు తానే స్వయంగా ప్రత్యక్ష ఎన్నికల గోదాలోకి దూకారు. ఆయన స్థాపించిన జన సూరాజ్ పార్టీ కోర్ కమిటీ నిర్ణయం ప్రకారం.. బీహార్‌లోని అత్యంత హై-ప్రొఫైల్ అసెంబ్లీ స్థానమైన బాంకీపూర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై, ఇటీవల రాజ్యసభకు వెళ్లిన సీనియర్ నేత నితిన్ నబీన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి జూలై 30, 2026 న ఉపఎన్నిక జరగనుంది. గత ఏడాది జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వయంగా పోటీ చేయడానికి వెనుకడుగు వేసిన పీకే.. ఇప్పుడు ఏకంగా బీజేపీకి కంచుకోట లాంటి స్థానంలో పోటీకి దిగడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ప్రశాంత్ కిషోర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద రాజకీయ అనివార్యత దాగి ఉంది. గత 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ అంచనాలతో 238 స్థానాల్లో పోటీ చేసిన జన సూరాజ్ పార్టీ.. ఒక్క సీటులో కూడా గెలవలేక పూర్తిగా చాపచుట్టేసింది. ఈ ఘోర పరాజయం వల్ల పీకే సృష్టించిన పొలిటికల్ హైప్ ఒక్కసారిగా కరిగిపోయింది. పార్టీ ఉనికిని కాపాడుకోవాలన్నా, కేడర్‌లో తిరిగి ఉత్సాహం నింపాలన్నా తానే స్వయంగా యుద్ధరంగంలోకి రావాలని పీకే భావించారు. అందుకే, తదుపరి సార్వత్రిక పోరు దాకా ఆగకుండా, ఈ ఉపఎన్నికను తన రాజకీయ భవితవ్యానికి ఒక యాసిడ్ టెస్ట్ గా మార్చుకున్నారు. 1990ల కాలం నుండి గతంలో పట్నా వెస్ట్ గా ఉన్న ఈ నియోజకవర్గం బీజేపీకి అల్ట్రా-సేఫ్ సీటు. నితిన్ నబీన్ ఇక్కడి నుండి వరుసగా 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పట్నా నగర పరిధిలోని అత్యంత ధనిక, విద్యావంతులైన ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో కమలం జెండాను కాదని వేరే పార్టీ గెలవడం దాదాపు అసాధ్యమనే టాక్ ఉందిఅయితే, ఇంతటి కఠినమైన నియోజకవర్గాన్ని పీకే ఎంచుకోవడం వెనుక కూడా ఒక స్ట్రాటజిస్ట్ మైండ్ దాగి ఉంది. బాంకీపూర్‌లో బీహార్‌లోనే అత్యధికంగా అక్షరాస్యత రేటు ఉంది. ఇక్కడి ఓటర్లు కుల సమీకరణాల కంటే అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యార్హతలు



చూసి ఓటు వేస్తారనే నమ్మకం పీకేకు ఉంది. బాంకీపూర్ ప్రజలు బీహార్‌లోనే అత్యంత చైతన్యవంతులు.. సరైన ప్రత్యామ్నాయం దొరికితే వారు మార్పు కోరుకుంటారు అని పీకే ఓటర్లను నేరుగా ఆకర్షిస్తున్నారు. పైగా, ఈ ఎన్నికను బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ఆర్నెల్ల పాలనపై ఒక రెఫరెండం గా ఆయన అభివర్ణిస్తున్నారు. ఒకవేళ ఇక్కడ ఓడిపోయినా బీజేపీ కోటలో గట్టి ఫైట్ ఇచ్చాం అని చెప్పుకోవచ్చు, పొరపాటున గెలిస్తే మాత్రం బీహార్ రాజకీయాల్లో జన సూరాజ్ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందిప్రస్తుత గెలుపు అవకాశాలను అంచనా వేస్తే.. పీకేకు ఇది అత్యంత భారీ రిస్క్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో బీజేపీ ఓటు బ్యాంక్ ఇక్కడ చాలా పటిష్టంగా ఉంది. పీకే రాకతో కాంగ్రెస్ నాయకుడు రిషి మిశ్రా లాంటి వారు మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ.. అధికారిక ప్రతిపక్షమైన ఆర్జేడీ -కాంగ్రెస్ కూటమి మహాగఠ్‌బంధన్ ఇక్కడ సొంత అభ్యర్థిని నిలబెడితే ఓట్లు చీలిపోయి బీజేపీకి మరింత లాభం చేకూరుతుంది. పైగా బీహార్ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా పెట్టిన జన్శక్తి జనతా దళ్ తరఫున సామాజిక కార్యకర్త వీణా మాన్విని బరిలోకి దించడం కమలదళానికి రూట్ క్లియర్ చేస్తోంది.ఆగస్టు 3న వచ్చే ఫలితాల్లో పీకే గనుక ఇక్కడ డిపాజిట్ కోల్పోతే.. కేవలం ఢిల్లీ ఏసీ రూముల్లో కూర్చుని స్క్రిప్టులు రాసే కార్పొరేట్ స్ట్రాటజిస్టే తప్ప, గ్రౌండ్ లెవెల్ లీడర్ కాదంటూ ప్రత్యర్థులు ఆయన్ను రాజకీయంగా సమాధి చేసే ప్రమాదం ఉంది. అలా కాకుండా బీజేపీ మెజారిటీని భారీగా తగ్గించినా, లేదా అద్భుతం జరిగి గెలిచినా.. 2025 పరాభవానికి పీకే సరైన రివెంజ్ తీర్చుకున్నట్లవుతుంది. ఈ చావో రేవో పోరాటంలో పీకే మైండ్ గేమ్ గెలుస్తుందా, లేక కమలం కోట నిలుస్తుందా అనేది బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత ఉత్కంఠ రేపుతోంది.

# భారతీయ రైల్వే మరో అద్భుతం

**ముంబై :** భారతీయ రైల్వే మరో అద్భుతం చేసింది. ఇప్పటికే ప్రమాదాల నివారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుంది. రైల్వేకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో రైల్వే ట్రాక్లను పెంచుతుంది. కొత్త రైల్వే మార్గాలు ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో రైల్వే ఇంజనీరింగ్ వ్యవస్థ మరో అద్భుతం చేసింది.. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ మరో ట్రైన్‌తో పక్కపక్క ట్రాక్‌లపై ఆగకుండా, వేగంగా పయనిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. గతంలో ఎక్స్‌ప్రెస్ లేదా వీఐపీ ట్రైన్లు వస్తే ఇతర ట్రైన్లను స్టేషన్ వద్ద నిలిపేసేవారు. ఇప్పుడు రెండు ట్రైన్లు స్వేచ్ఛగా, సురక్షితంగా వెళ్తున్నాయి. నెటిజన్లు దీన్ని "నయా భారత్.. పాత రోజులు పోయాయ్!" అంటూ ప్రశంసిస్తున్నారు. బీజేపీ కూడా ఈ వీడియోను ట్వీట్ చేసింది.వీడియోలో వందే భారత్ ట్రైన్ మరో సాధారణ ట్రైన్‌తో పక్కపక్కనే ట్రాక్‌పై దూసుకెళ్తున్న దృశ్యం కనిపిస్తుంది. రెండు ట్రైన్లు ఆగకుండా, ఒకదాని వేగాన్ని మరొకటి అడ్డుకోకుండా వెళ్తున్నాయి. దీన్ని చూసిన వారు "ఇది ఇంజనీరింగ్ మార్వెల్", "పాత రోజులు పోయాయి", "మోడర్న్ టెక్ సిగ్నలింగ్‌కు థాంక్స్" అని కామెంట్లు చేస్తున్నారు. ఈ వీడియో రైల్వే అభివృద్ధిని ప్రతిబింబిస్తుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. భారతీయ రైల్వేల్లో మాన్యువల్ సిగ్నలింగ్ వ్యవస్థ ఉండేది. ఎక్స్‌ప్రెస్ లేదా ముఖ్యమైన ట్రైన్లు రాగా, ఇతర ట్రైన్లను స్టేషన్ వద్ద ఆపేవారు. ఇది సేఫ్టీ కారణాలు, ప్రయారిటీ ఇవ్వడం, ట్రాక్ సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల జరిగేది. ఫలితంగా ప్రయాణ సమయం పెరిగేది, ట్రైన్ల సామర్థ్యం పూర్తిగా వినియోగం కాకుండా పోయేది. ఇప్పుడు పరిస్థితి మారింది. డబుల్ ట్రాకింగ్, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్, కేంద్రీకృత ట్రాఫిక్ కంట్రోల్ వంటి ఆధునిక సాంకేతికతలు వచ్చాయి. ఇవి ట్రైన్లను ఒకదానితో ఒకటి సురక్షితంగా, సమన్వయంగా నడపడానికి వీలు కల్పిస్తున్నాయి. రెండు ట్రైన్లు పక్కపక్క




ట్రాక్‌లపై ఆగకుండా వెళ్లడం ఇప్పుడు సాధారణం అవుతోంది.ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ రైల్వేల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. ట్రైన్ల మధ్య దూరం తగ్గించి, ఎక్కువ ట్రైన్లను నడపవచ్చు. మానవ తప్పిదాలు తగ్గుతాయి. వేగం పెరుగుతుంది, సమయం ఆదా అవుతుంది. సేఫ్టీ స్థాయి పెరుగుతుంది. వందే భారత్ వంటి సెమీ హై-స్పీడ్ ట్రైన్లు ఈ వ్యవస్థతో మరింత సమర్థవంతంగా నడుస్తున్నాయి. రైల్వేల్లో జరుగుతున్న సాంకేతిక విప్లవానికి ఇది మరో చిహ్నం. గత కొన్నేళ్లలో రైల్వేలు డబుల్ ట్రాకింగ్, ఎలక్ట్రిఫికేషన్, కొత్త ట్రైన్లు, స్టేషన్ల ఆధునీకరణ వంటి అనేక మార్పులు చేశాయి. ఫలితంగా ప్రయాణ సమయం తగ్గింది. ట్రైన్ల సంఖ్య పెరిగింది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయి. తాజాగా రెండు ట్రైన్లు ఆగకుండా వెళ్లడం రైల్వేల సామర్థ్యం, సేఫ్టీ, సాంకేతికత మూడూ మెరుగుపడ్డా యని అర్థం.ఈ వైరల్ వీడియో భారతదేశం ఆధునికీకరణ వైపు అడుగేస్తున్నట్లు చూపిస్తోంది. మోడర్న్ టెక్నాలజీ, మెరుగైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వల్ల ప్రజల జీవితాలు సులభతరం అవుతున్నాయి. ఇంకా మెరుగైన సిగ్నలింగ్ వ్యవస్థలు, హై-స్పీడ్ రూట్లు, మరిన్ని వందే భారత్ ట్రైన్లు వస్తే రైల్వేలు మరింత వేగవంతం, సురక్షితం అవుతాయి.

# చైనాకు చెక్ పెట్టినట్టేనా

**ఇటానగర్ :** ఇటీవల కాలంలో మన చుట్టూ ఉన్న సముద్ర ప్రాంతాలలో పట్టు సాధించడానికి చైనా అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తోంది. పాకిస్తాన్ దేశంతో దోస్తీ కడుతోంది. బంగ్లాదేశ్ తో కూడా మైత్రి కొనసాగిస్తోంది. చివరికి చిన్న చిన్న దేశాలను కూడా వదిలిపెట్టడం లేదు. తద్వారా భవిష్యత్ కాలంలో ఏవైనా పరిణామాలు జరిగితే.. మన దేశాన్ని ఇబ్బంది పెట్టడానికి చైనా అందించిన ఏ అవకాశాన్ని కూడా వదిలిపెట్టడం లేదు. సహజంగానే చైనా దుర్మార్గమైన దేశం. తన ప్రయోజనాల కోసం ఏమైనా చేసే దేశం. అలాంటప్పుడు చైనాతో జాగ్రత్తగా ఉండాలి. చైనా తో స్నేహం కొనసాగించే దేశాలతో భారత్ మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇదే సమయంలో వ్యూహాత్మక ధోరణి ప్రదర్శించాలి.సరిగ్గా ఇదే ఆలోచనతో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇండోనేషియా దేశంలో పర్యటిస్తున్నారు. కీలకమైన ఒప్పందాలు చేసుకుంటున్నారు. అయితే అక్కడితోనే నరేంద్ర మోడీ ఆగిపోవడం లేదు. చైనాకు ఏకకాలంలో చెక్ పెట్టే విధంగా ఇండోనేషియాతో ఆయన ఒప్పందాలకు కుదుర్చుకున్నారు. ఇందులో




ప్రధానమైనది మలక్కా జల సంధి వద్ద నిర్మిస్తున్న సబాంగ్ పోర్ట్.ఈ పోర్టును భారత్.. ఇండోనేషియా దేశాలు కలిసి సంయుక్తంగా నిర్మిస్తాయి. మలక్కా జల సంధి ద్వారా 40% గ్లోబల్ ట్రేడ్ జరుగుతుంది. చైనా టోటల్ మారీ టైం ట్రేడ్ 60 నుంచి 70% ఇక్కడ నుంచే సాగుతూ ఉంటుంది. ఈ జలసంధికి 100 మైళ్ళ దూరంలో భారత్.. ఇండోనేషియా కలిసి సభాంగ్ పోర్టు నిర్మిస్తున్నాయి. దీంతోపాటు భారత్ ఇండోనేషియా తో కలిసి అత్యంత వ్యూహాత్మకమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.. ఇటీవల కాలంలో హోర్మోజ్ జల సంధి మూతపడితే ప్రపంచం ఏ స్థాయిలో ఒత్తిడి ఎదుర్కొందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నేటి ఆధునిక కాలంలో కూడా చాలావరకు సరుకు రవాణా జల సందుల మీదుగానే సాగుతూ ఉంది. అలాంటప్పుడు వ్యూహాత్మకంగా పోర్టులు నిర్మించుకుంటే భవిష్యత్తు కాలంలో వచ్చే ఇబ్బందులను సులువుగా ఎదుర్కోవచ్చు.సబాంగ్ పోర్టు ద్వారా భారత చైనాకు చెక్ పెడుతుంది. ఎలాగంటే చైనాకు సంబంధించిన ట్రేడ్ లో సింహభాగం ఇక్కడి నుంచే కొనసాగుతూ ఉంటుంది. అలాంటప్పుడు భారత్ ఇక్కడ పోర్ట్ నిర్మిస్తే.. చైనా ఒకవేళ భవిష్యత్తు కాలంలో తోక జాడించే కార్యక్రమాలకు శ్రీకారం చుడితే.. భారత్ ఇక్కడ అడ్డుకోవచ్చు. ఫలితంగా చైనాకు వాణిజ్యపరంగా ఎదురు దెబ్బ తగులుతుంది. చైనా జుట్టు మన చేతిలో ఉండాలంటే కచ్చితంగా ఇండోనేషియా మనకు అనుకూలంగా ఉండాలి. అన్నిటికంటే ఇక్కడి పోర్టు మీద మన పెత్తనం ఉండాలి. అందువల్లే నరేంద్ర మోడీ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇండోనేషియాతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

నవగీత తెలుగు దినపత్రిక
శుక్రవారం
10 జూలై 2026

# విపత్తుల సమయంలో ఎస్డీఆర్ఎఫ్ కీలకం

**ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో ఎస్డీఆర్ఎఫ్ యంత్రాలు, పరికరాల ప్రదర్శన**

**హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**



**రాజన్న సిరిసిల్ల :** విపత్తుల సమయంలో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) ఆద్వర్యంలో విపత్తులు, వరదలు వచ్చే సమయంలో ఉపయోగించే యంత్రాలు, పరికరాల ప్రదర్శన గురువారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులను గుర్తించే కెమెరా, రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్ (ప్రాణరక్షక తేలియాడే పరికరం), తనిఖీ రంధ్రం చేసే పరికరం, ఎత్తైన వెలుతురు స్తంభం (లైట్ మాస్ట్), రక్షణ కార్యక్రమాల కోసం ఉపయోగించే రోటరీ కట్టింగ్ యంత్రం,గాలి ద్వారా బరువులను ఎత్తే లిఫ్టింగ్ బ్యాగ్, పీవీసీ రక్షణ దుస్తులు, హైడ్రాలిక్ స్ప్రెడర్ కట్టర్ (లోహాన్ని విప్పే, కత్తిరించే పరికరం) ప్రదర్శన లో పెట్టగా, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులతో కలిసి పరిశీలించారు.ఒక్క యంత్రం పనితీరు, వాటిని ఉపయోగించే విధానాన్ని వివరించారు.గత ఏడాది వరదలు వచ్చినప్పుడు కామారెడ్డి, వరంగల్ ఇతర ప్రాంతాల్లో ఎస్ డీ ఆర్ ఎఫ్ టీమ్ అందించిన సేవల వీడియోలను ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంతో పాటు సెప్టెంబర్, అక్టోబర్ నెలలో భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ డీ ఆర్ ఎఫ్ బృందం శిక్షణ లో నేర్చుకున్న అంశాలు విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే వినియోగించాల్సి వస్తుందని తెలిపారు.అప్పుడు ప్రతి నిమిషం విలువైందని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు ఒక టీమ్ గా సమాచారం చేరవేస్తూ.. వరదలు వచ్చినప్పుడు సమన్వయంతో సేవలు అందించాలని ఆదేశించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు వివిధ జిల్లాల్లో ఉత్తమ సేవలు అందించిన ఎస్డీఆర్ఎఫ్ బృందం, ఇతర అధికారులను అభినందించారు. ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు.ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడు తూ.. వర్షాలు వస్తే సేవలు అందించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఏడాది వరదలు సంభవించి ఇబ్బంది పడిన చోట్ల అధికారులు పరిశీలించి.. ఇంకా కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. విపత్తులు సంభవించినప్పుడు వాడే పరికరాలు, యంత్రాలతో మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఇంకా ఏమైనా యంత్రాలు, పరికరాలు కావాల్సి ఉంటే ముందస్తుగా తెప్పించాలని సూచించారు. ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కమాండెంట్ పీ జె.పి.సి. ఛటర్జీ, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్,అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ బండి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ పార్టీ అకౌంట్లలో
# 1400 కోట్లపై నిగ్గు తేల్చాలి



**హైదరాబాద్ :** సింగరేణిలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై మీడియాతో మాట్లాడిన టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్ల అవినీతి సొమ్ము ఉందని అన్నారు. దీన్ని వెంటనే అమరవీరుల కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లేది లేదన్నారు. తాను మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్తానంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి కార్మికులకు కోసం 20వ తేదీ నుంచి నిరవధిక దీక్ష చేస్తున్నట్టు ప్రకటిం చారు. టీఆర్ఎస్ అనే పేరు తనకు రాకుండా ఉండాలనే కుట్రతో ఈసీకి వెయ్యికి పైగా కంప్లైంట్స్ బీఆర్ఎస్ ఇచ్చిందని చెప్పారు. భయం లేదంటూనే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. నా ప్రజా పోరాటాలను ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, బీజేపీతో చేతులు కలుపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఒక నీతి, నియమం అంటూ ఏమీ లేవా అని ప్రశ్నించారు. తల్లి, చెల్లె అనే సభ్యత మరిచి బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఇష్టానుసారం కామెంట్లు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. సభ్యత మరిచి తిడితే ఊరుకునేందుకు ఇది ఆంధ్రా కాదు, కాళ్లు విరగొట్టి చేతుల్లో పెడతాం బిడ్డా అని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. కేటీఆర్ తన మిత్రుడు ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్‌ప్రో కో ద్వారా అక్రమ పర్మిషన్లు ఇచ్చారని అన్నారు. "కాళేశ్వరం అవినీతిలో అనకొండ అయిన హరీశ్‌రావు నే బీఆర్ఎస్ ఇంకా ముందు పెడుతోంది. ఇక ఆ పార్టీ జీవితంలో బాగుపడదని స్పష్టమైంది. చేసిన అవినీతి, పెద్ద ఆయనకు అంటించిన అవినీతి మరకలు చాలవన్నట్లుగా మూడు నెలలు మంత్రి పదవి కావాలంట?. బీఆర్ఎస్ మీద కోపంతో కాళేశ్వరం నీళ్లను ముఖ్యమంత్రి ఎత్తిపోయటం లేదు. అర కిలోమీటర్ రాళ్ల కట్ట కడితే మొత్తం నీళ్లు ఎత్తిపోసుకోవచ్చు." అని అన్నారు. పార్టీ పెట్టుకొని తన పని తాను చేసుకుంటూ పోతున్నానని, ఇప్పటి వరకు కూడా బీఆర్ఎస్ విషయంలో ఎక్కడ పర్సనల్ విషయాలు చెప్పలేదని కవిత అన్నారు. "పార్టీ పెట్టిన ఆరు నెలల వరకు అన్ని పార్టీల గురించి మాట్లాడి ఆ తర్వాత ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాను. కానీ నా పార్టీతో భయం లేదంటూనే బీఆర్ఎస్ వాళ్లు వెయ్యి కి పైగా ఈసీకి కంప్లైంట్స్ ఇచ్చారు. మా పార్టీకి సంబంధించిన వార్తలు రాసే వారికి గుంటనక్క ఫోన్లు చేస్తూ రాయవద్దని చెబుతోంది. అదే విధంగా 188 కోట్లు పెట్టి కేటీఆర్ ఇటీవలే పయోనీర్ అనే ఇంగ్లీష్ పేపర్ కొనుగోలు చేశాడు. క్విడ్ ప్రోకోలో భాగంగా తన మిత్రుడు ప్రదీప్ కన్ స్ట్రక్షన్‌కు అక్రమంగా పర్మిషన్లు ఇచ్చి పెద్ద భవనాలు కట్టుకునే అవకాశం ఇచ్చాడు. డబ్బు ఉంటే సోషల్ మీడియా, మీడియాను కొనుగోలు చేసి మా వార్తలు రాకుండా చేయాలని చూస్తున్నారా?. పార్టీని జోడెద్దుల మాదిరిగా నడపాల్సిన వాళ్లే అంబోతుల్లాగా సిగ్గు లేని వ్యవహారాలు చేస్తున్నారు. అసలు బీఆర్ఎస్ పార్టీకి నీతి, నియమం, ఒక విధానం అంటూ లేకుండా చేస్తున్నారు. ఒక పార్టీ తన విధానాలు చెప్పుకుంటూ ప్రజా పోరాటాలు చేసుకునే హక్కు లేదా? మేము ఉద్యమకారుల గురించి పోరాటం చేస్తే ఆ వార్తలు రాకుండా ఫోన్లు చేసి అడ్డుకున్నారు. అంటే మీరు ఉద్యమకారులకు అన్యాయం చేస్తే...మేము పోరాటం చేయటం మీకు సమస్యగా మారిందా?""అసలు బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లో ఉన్న 14 వందల కోట్ల రూపాయలు క్విడ్ ప్రో కో ద్వారా వచ్చినవి కావా? మీ పార్టీలో అకౌంట్‌లో ఉన్న డబ్బును అమరవీరుల కుటుంబాలకు కోటి చొప్పున పంచాలని డిమాండ్ చేస్తున్నా. ఒక ఆడబిడ్డ ఒంటరిగా ధైర్యంగా పోరాటం చేస్తే ఇన్ని కుట్రలు చేస్తారా? ప్రజల కోసం పోరాటం చేయాలంటే ప్రజాబలం, గుండె బలం ఉండాలి. దమ్ముంటే నాతో పాటు ప్రజా సమస్యల పోరాటం విషయంలో పోటీ పడండి. నేను మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్తానంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ లో చేరేదే లేదు. ఫినిక్స్ సంస్థకు 80 వేల కోట్ల విలువైన భూములు కట్టబెట్టారు. వాడు ఆంధ్రావాడా? తెలంగాణ వాడా? ఆ సంస్థ వాడు 33 లక్షల టన్నుల కలప కొట్టేస్తున్నాడు. ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ పెట్టిన కేసులను కూడా మళ్లీ పట్టించుకోవటం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన భూమికి ఇంకా ఎక్కువగా ఈ ప్రభుత్వం కూడా భూమి ఇస్తోంది. అవినీతి విషయంలో బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే కాంగ్రెస్ తలుపులు తెరిచింది." కచ్చితంగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం అప్పన్నంగా అప్పగించిన భూములు అన్నింటిపైన రివ్యూ చేస్తామన్నారు. మొత్తం అవినీతిని కక్కిస్తామన్నారు. ఎవరినీ కూడా వదిలిపెట్టబోమని చెప్పారు. ఈ రెండు పార్టీలకు అసలు ప్రజా అజెండా అనేదే లేదని మండిపడ్డారు. కేవలం దోచుకోవటం మీద దృష్టి ఉందని ఫైర్ అయ్యారు. "తెలంగాణ ఉద్యమం సమయంలో చిన్న కాంట్రాక్టర్లు, స్కూల్ యాజమాన్యాలు ఎంత ఖర్చు చేశారు. తెలంగాణ సాధించిన తర్వాత వారికి న్యాయం జరగాలని నేను బీఆర్ఎస్ లో ఉండి కొట్లాడాను. అప్పుడు కూడా ఉద్యమకారులు, కార్మికుల కోసం నేను ఫైట్ చేశాను. కార్మికులతో ఎవరున్నారో, కాంట్రాక్టర్లతో ఎవరున్నారో ప్రజలందరికీ తెలుసు. బీఆర్ఎస్‌లో ఉండి కూడా ఉద్యమకారుల కోసం వారి పక్షాన నిలబడ్డాను. కానీ వారికి అన్యాయం జరిగింది. అందుకే చాలా ఆవేదనతో చెబుతున్నా. బీఆర్ఎస్ పార్టీ అకౌంట్ లో ఉన్న డబ్బును అమరవీరుల కుటుంబాలకు పంచాలి.

# బండి భగీరథ్‌కు బెయిల్


**హైదరాబాద్ :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. పోక్సో కేసులో అరెస్టు అయ్యి జైల్లో ఉన్న ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు అయ్యింది. ఇరు పక్షాల వాదన విన్న హైకోర్టు భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు పలు షరతులు విధించింది. దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేసే చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. లక్ష పూచీకత్తు సమర్పించాలని పేర్కొంది.బండి భగీరథ్ తనపై అత్యాచారం చేశాడని 16ఏళ్ల బాలిక హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు మాయమాటలు చెప్పి తన పలు మార్లు అఘాయిత్యానికి పాల్పడినట్టు తల్లితో కలిసి ఆమె ఫిర్యాదు చేయడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె వయసు నిర్ధారించుకున్న తర్వాత పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఇంతలో బండి భగీరథ్ కనిపించకుండా పోయారు. నాలుగు రోజుల హైడ్రామా తర్వాత పోలీసులు ఆయన్ని కూడా అరెస్టు చేశారు. వెంటనే కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి 45రోజుల పాటు రిమాండ్ ఖైదీగా భగీరథ్ ఉన్నారు. ఈ మధ్య పరీక్షలు ఉన్నాయని చెప్పి మధ్యంతర బెయిల్ తీసుకున్నారు. వారం రోజుల పాటు ఇంట్లో ఉండి పరీక్షలు రాసిన తర్వాత కోర్టులో లొంగిపోయారు. ఈ కేసులో తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో పిటిషన్ వేసుకున్నారు. దీనిపై నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. భగీరథ్ విద్యార్థి అని జైల్లో ఉండటం వల్ల చాలా ఆయన కెరీర్‌పై ఎఫెక్ట్ పడుతుందని వాదించారు. పరస్పర అంగీకారంతో జరిగిన విషయాలను కక్షపూరితంగా బహిర్గతం చేసి కేసులు పెట్టారని అన్నారు.దీనిపై పీపీ లాయర్లు తప్పుపట్టారు. ఆయనకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, ఆయన ఫ్యామిలీకి ఉన్న పలుకుబడిని ఉపయోగించి కేసును తప్పుదారి పట్టిస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసు విచారణ కీలక దశకు చేరుకుందని అభియోగపత్రాలు దాఖలు చేస్తామని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బెయిల్ మంజూరు చేస్తే కచ్చితంగా దర్యాప్తుపై ప్రభావం చూపుతుందన్నారు. అన్ని వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన తీర్పును రిజ్వర్ చేశారు. ఈ మధ్యాహ్నం తీర్పు వెల్లడించారు. బండి భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీని కోసం షరతులు విధించారు.



## మతం మారడంఇష్టం లేక ఆత్మహత్య

**హైదరాబాద్ :** ఆర్థిక వివాదాలు, మతం మారాలంటూ పొరుగువారి నుంచి ఎదురైన తీవ్ర ఒత్తిడి కారణంగా ఓ దంపతులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన ఈ జంట, తమ ఇద్దరు చిన్నారులను అనాథలను చేస్తూ జూలై 2న ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు వదిలారు. క్రైస్తవ మతంలోకి మారాలని పొరుగువారు తమ తల్లిదండ్రులను బలవంతం చేశారని, ఆ వేధింపులే వారి ఆత్మహత్యకు దారితీశాయని వారి 14 ఏళ్ల కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టిస్తోంది.వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేటకు చెందిన రవికుమార్, శిరీష దంపతులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలసు వచ్చి, హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరులో నివాసం ఉంటున్నారు. బియ్యం వ్యాపారం చేసే రవికుమార్‌కు పొరుగున ఉండే వెంకట్, ప్రమీలతో పరిచయం ఏర్పడింది. రెడీమిక్స్ కాంక్రీట్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే నెలకు రూ.20,000 ఆదాయం వస్తుందని వారు నమ్మించారు. వారి మాటలు నమ్మిన రవికుమార్, తన భార్య బంగారు నగలను తాకట్టు పెట్టి సుమారు రూ.20 లక్షల వరకు వారికి అందజేశారు.అయితే, నిందితులు కేవలం రెండు మూడు నెలలు మాత్రమే నగదు చెల్లించి, ఆ తర్వాత నిలిపివేశారు. దీంతో అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడంతో రవికుమార్ దంపతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఇదే సమయంలో మతం మార్చుకోవాలంటూ వెంకట్, ప్రమీల తమపై ఒత్తిడి తెచ్చారని, చర్చికి రావాలని నిరంతరం వేధించేవారని వారి కుమారుడు సుశాంత్ పోలీసులకు తెలిపాడు. ఈ వేధింపులు భరించలేక వారు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవడానికి కూడా సిద్ధపడ్డారు.జూలై 2న ఆత్మహత్యకు పాల్పడకముందు రవికుమార్ దంపతులు వెంకట్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు కాల్ డేటా రికార్డులు ద్వారా స్పష్టమవుతోంది. ఘటనానంతరం పరారైన వెంకట్, ప్రమీలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తమపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, తదుపరి విచారణలో భాగంగా దానిని ఆత్మహత్యకు ప్రేరేపణ (సెక్షన్ 108) కింద మార్చి దర్యాప్తు చేపట్టారు. మత మార్పిడి ఆరోపణలపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను వరంగల్‌లోని బంధువుల వద్దకు చేర్చారు.

## కాక రేపుతున్న కడియం, కొండా వివాదం



**వరంగల్ :** తెలంగాణలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లా స్థాయి నాయకుల మధ్య సమన్వయం లోపం పెను దుమారం రేపుతూనే ఉంది. ఇప్పటికే ఇలాంటి పంచాయితీలు భరించలేని నాయకులు తమ దారి తాము చూసుకున్నారు. మరికొందరు సైలెంట్ అయిపోయారు. ఇప్పుడు తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కడియం శ్రీహరి, మంత్రి కొండ సురేఖ మధ్య వివాదం తలెత్తింది. తన శాఖలో విషయాలపై తన శాఖ కమిషనర్‌తో కడియం శ్రీహరి ఎలా సమీక్ష జరుపుతారని కొండా సురేఖ నిలదీస్తున్నారు. కచ్చితంగా ఇది ఆయన అహంకారనికి నిదర్శనమని అంటున్నారు. అయితే ఇది అవగాహన లోపం కారణంగానే జరిగిందని కడియం శ్రీహరి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఈ వివాదాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సురేఖ, తాజాగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.

**మహేష్ గౌడ్‌ను కలిసి మంత్రి సురేఖ**

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై ఆగ్రహంతో ఉన్న మంత్రి కొండా సురేఖ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరితో సమస్యగా ఉందని, తనకు ఇబ్బంది పెట్టేలా రాజకీయం చేస్తున్నాని మండిపడ్డారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన శాఖలో జోక్యం చేసుకొని అధికారులతో ఎలా సమీక్ష నిర్వహిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వ్యక్తి ప్రోటోకాల్ పాటించుకుండా వ్యవహరించడం ఏంటని నిలదీశారు. క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రికి,, రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌కు లేఖ రాసినట్టు పేర్కొన్నారు.ఫిర్యాదు చేసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి కొండా సురేఖ... కడియం శ్రీహరిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన వ్యక్తి వారిని మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. మొదటి నుంచి కూడా కడియం రాజకీయం ఇలానే ఉంటుందని ఆరోపించారు. తెలుగుదేశంలో ఆయనకు మిత్రులుగా ఉన్న వారి సహకారం కూడా ఉందని అందుకే ఇష్టం వచ్చినట్టు రెచ్చిపోతున్నారని తీవ్రమైన విమర్శలు చేశారు. గతంలో కీలక పదవుల్లో అధికార దర్పం వెలగబెట్టిన శ్రీహరి ఇప్పుడు సాధారణమైన ఎమ్మెల్యేగా ఉండలేకపోతున్నారని ఆరోపించారు.

**త్వరలోనే అన్నీ సర్దుకుంటాయి: మహేష్ గౌడ్**

రగులుతున్న రాజకీయం త్వరలోనే సమసిపోతుందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జరుగుతున్న పరిణామాలపై నేతలతో మాట్లాడుతున్నట్టు వెల్లడించారు. త్వరలోనే అన్ని పరిష్కారం అవుతాయని అన్నారు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఇలాంటివి సర్వసాధారణంగా జరుగుతుంటాయని, అందర్ని పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగేలా ఎవరు వ్యవహరించినా సహించేది లేదన్నారు.

## నా లవర్ ను పెళ్లి చేసుకోవద్దంటూ పోస్టర్లు

**కరీంనగర్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గ్రామంలో వెలసిన కొన్ని పోస్టర్లు స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించాయి. ఒక యువతి, యువకుడి మధ్య గల ప్రేమ వ్యవహారానికి సంబంధించిన ఈ పోస్టర్లు వివాదాస్పదం కావడంతో, బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.గ్రామానికి చెందిన ఓ యువతితో తాను గత ఏడేళ్లుగా ప్రేమలో ఉన్నానని సదరు యువకుడు ఆ పోస్టర్లు ద్వారా పేర్కొన్నాడు. తమ ప్రేమ విషయం తెలిసినప్పటికీ, ఆమె తల్లిదండ్రులు బలవంతంగా వేరొకరితో వివాహం నిశ్చయించారని ఆరోపించాడు. అంతేకాకుండా, తమ ప్రేమ వ్యవహారం గురించి కాబోయే వరుడికి చెప్పినప్పటికీ, అతడు 16 తులాల బంగారం తీసుకుని ఈ పెళ్లికి అంగీకరించాడని ఆ యువకుడు ఆరోపణలు గుప్పించాడు. యువకుడు, యువతితో పాటు కాబోయే వరుడి ఫోటోలతో కూడిన ఈ పోస్టర్లను గ్రామ కూడళ్లు, గోడలపై అంటించడంతో అవి గ్రామస్థుల దృష్టిని ఆకర్షించాయి. ఈ విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోస్టర్లలో పేర్కొన్న ఆరోపణల వాస్తవికతపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

**హైదరాబాద్ :** మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టుమిషన్లు అందించడం విద్యార్థులకు స్కాలర్షిప్లు అందించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత అన్నారు హైదరాబాద్ మణికొండ వాసవి గోల్డ్ అండ్ డైమండ్ అధినేత రాజు తన జన్మదినం సందర్భంగా వందమంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు ,విద్యార్థులకు స్కాలర్షిప్లు పంపిణీ చేశారు. పేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న వైశ్య బిజినెస్ నెట్వర్క్ ద్వారా దాతల సహకారంతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు.

# గ్రామాల భవిష్యత్ తరతరాలకు ప్రయోజనం చేకూరే శాశ్వత పనులు చేపట్టాలి :

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**
**గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం**





**నవగీతం, జగిత్యాల ప్రతినిధి:** వి.బి.జి.రామ్‌జీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లో 10 మండలాలు సారంగాపూర్, బీర్ పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్, ధర్మపురి, బుగ్గారం, ఎండపెల్లి, వెల్గటూర్, గొల్లపెల్లి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు.మాస్టర్ ట్రైనర్/ ఎం.పి.డి.ఓ. చిరంజీవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, వి.బి.జి.రామ్‌జీ పథకం, నరేగా పథకంలో వచ్చిన మార్పులను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, 2005లో గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, గత 21 సంవత్సరాలుగా ఈ పథకం విజయవంతంగా అమలై గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం గణనీయంగా తగ్గిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు, విద్యా స్థాయి కూడా ఎంతో మెరుగుపడ్డాయని తెలిపారు.గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని, చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, మంజూరైన నిధులతో పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.?గ్రామనలోని వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి, పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని,ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత ఆస్తుల సృష్టే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం వి.బి.జి.రామ్‌జీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఉండగా, కొత్త పథకం ద్వారా గ్రామాలకు ఉపయోగపడే ఆస్తుల నిర్మాణంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు.
గతంలో నరేగా నిధుల్లో అధిక భాగం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే వినియోగించారని, కొత్త పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తే గ్రామాలను అద్భుతంగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.
నరేగా పథకంలో ప్రభుత్వ పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవకాశం లేకపోయినా, కొత్త వి.బి.జి.రామ్‌జీ పథకంలో ఆ అవకాశం కల్పించారని తెలిపారు. జిల్లాలో అవసరమైన ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాన్ని ఈ పథకం ద్వారా చేపట్టాలని సూచించారు.అదేవిధంగా గ్రామీణ గ్రంథాలయాలు, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, సోలార్ వీధి దీపాలు, బస్ స్టాండ్లు, గోదాములు, కోల్డ్ స్టోరేజీలు తదితర 318 రకాల అభివృద్ధి పనులను ఈ పథకం ద్వారా చేపట్టే అవకాశం ఉందన్నారు. కేవలం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే పరిమితం కాకుండా గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.మొత్తం నిధుల్లో కనీసం 50 శాతం నిధులను శాశ్వత ఆస్తుల సృష్టికే వినియోగించేలా గ్రామపంచాయతీలు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్లు నిర్మించడం అవసరమే అయినప్పటికీ, గ్రామానికి తరతరాల పాటు ఉపయోగపడే ఆస్తులను సృష్టిస్తే ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని ప్రజాప్రతినిధులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి. రాజ గౌడ్, జెడ్పీ సి ఈ ఓ గౌతం రెడ్డి, డి ఆర్ డి ఓ రఘువరన్, డిపిఓ మధుసూదన్, మాస్టర్ ట్రైనర్/ ఎం.పి.డి.ఓ. చిరంజీవి, సంబంధిత జిల్లా అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్ నూతన కమిటీకి డీఎస్పీ అభినందనలు

**పత్రికా రంగం ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం..**
**బాధ్యతాయుత జర్నలిజంతో ప్రజలకు సేవ చేయాలి: డీఎస్పీ శ్రీనివాస్ లు**





: టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం గురువారం రోజున రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్ లు టౌన్ సీఐ వీరప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు,ఈ సందర్భంగా డీఎస్పీ, సీఐలను శాలువాలతో సత్కరించి, శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం డీఎస్పీ కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని డీఎస్పీ శ్రీనివాస్ లు, టౌన్ సీఐ వీరప్రసాద్ శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతన కార్యవర్గం పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ లు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్థంభంగా కీలక బాధ్యతను నిర్వర్తిస్తోందన్నారు. ప్రజలకు వాస్తవాలను నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా చేరవేయడంలో పాత్రికేయుల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పోలీసు శాఖ--మీడియా పరస్పర సహకారం ఎంతో అవసరమని అన్నారు.వాస్తవాల ఆధారంగా వార్తలను ప్రచురించడం ద్వారా ప్రజల్లో మీడియాపై విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు పాత్రికేయుల సంక్షేమం కోసం కూడా నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షిస్తూ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రేగుల రాంప్రసాద్, జిల్లా క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ సయ్యద్ రసూల్, ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు కొత్వాల్ శ్రీనివాస్, జితేందర్ రావు, ఉపాధ్యక్షులు సిహెచ్ దేవరాజ్, విష్ణు, కోశాధికారి పంపరి నాగరాజు, ఫాహద్, జింక శ్రీధర్,కమటాల విజయ్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు, సంటి రాజేందర్, షబ్బీర్ గంగాధర్, పండుగ స్వామి, నవీన్, ఆసీమ్,లక్ష్మీనారాయణ,రాము పాల్గొన్నారు.

## ఆర్టీసీలో 1500 కండక్టర్లు

**హైదరాబాద్ :** నిరుద్యోగ యువతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా చేపట్టబోతుండగా... చాలా సంవత్సరాల తర్వాత తెలంగాణలో పర్మినెంట్ (శాశ్వత) ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాలను భర్తీ చేస్తుండటం విశేషం.ఈ నోటిఫికేషన్‌లో అభ్యర్థులకు ఊరటనిచ్చే అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ ఉద్యోగాలకు ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించడం లేదు. కేవలం టెన్త్ క్లాస్ లో సాధించిన మార్కుల శాతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ విధానం, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను సిద్ధం చేసి నేరుగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఎలాంటి పోటీ పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగం సాధించే సువర్ణావకాశం కావడంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో పర్మినెంట్ బేసిస్‌పై కండక్టర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే మొదటిసారి. గత కొన్నేళ్లుగా చాలా మంది ఉద్యోగులు రిటైర్ కావడంతో ఖాళీలు భారీగా పెరిగాయి.

## ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



**నవగీతం:వైరాప్రతినిధి** తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్, మహిళ శిశు సంక్షేమం, మంత్రివర్యులు ధన సరి అనసూయ ( సీతక్క) జన్మదిన వేడుకలు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకూరి కిరణ్ ఆధ్వర్యంలో వైరా మండలం గొల్లపూడి గ్రామం నందు గల వృద్ధాశ్రమం నందు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదునూరు సీతారాములు, వీరంశెట్టి సీతారాములు, పొదిల హరినాథ్, పెద్దప్రోలు లక్ష్మయ్య, మల్లు రామకృష్ణ, పాలేటి నరసింహారావు, అడుసు మల్లి గణేష్, పోలూరి సైదులు, తదితరులు పాల్గొని ఘనంగా సీతక్క జన్మదిన కట్ చేసి పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు అనంతరం పిల్లలకు వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు మంత్రి సీతక్క ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మునుముందు మరెన్నో ఉన్నత పదవులు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## నివాళులర్పించిన మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్



**నవగీతం: వైరా ప్రతినిధి** వైరా మున్సిపాలిటీలోని ఒకటో వార్డు బీసీ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బ్రహ్మరాశి హనుమంతరావు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ వారి స్వగృహం నందు వెళ్లి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన అన్నారు. నివాళులర్పించిన వారిలో పోలూరి సైదులు, ముత్యాల కోటేశ్వరరావు, ముదిగొండ మహేష్, ముదిగొండ సురేష్ తదితరులు ఉన్నారు

## చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలి




**నవగీతం: వైరా ప్రతినిధి** విద్యార్థిని విద్యార్థు లు చదువులతో పాటుగా ఆటల్లో కూడా ఉన్నతమైన ప్రతిభ కనబరుస్తూ దేశ కీర్తిని ఇనుమడింప చేసేలా ఆటల్లో రాణించాలని జీవి మాల్ వారి విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకులు గుర్రం సీతా మహాలక్ష్మి అన్నారు. సిరిపురం ఉన్నత పాఠశాల యందు 24,000/-విలువచేసే 40 మంది విద్యార్థిని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్సులు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులు పెనుగొండ ఉపేంద్రరావు సూచన మేరకు ఈ స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేస్తున్నామని విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులకు పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తెచ్చే విధంగా ఇష్టపడి చదువుకోవాలని అన్నారు. గుట్ట బడి ఉపాధ్యాయులు పెనుగొండ ఉపేంద్ర రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక ప్రత్యేకతను కలిగి ఉంటారని ఆ ప్రత్యేకతను వెలికి తీసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయగలిగిన వారు అవుతారని, ఆటలు ఆడటం వల్ల మానసిక ప్రశాంతత శారీరక దృఢత్వం కలుగుతుందని అనారోగ్య సమస్యలు తొలగుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు గుర్రం లీలా లాస్య, లక్ష్మీ వేద, పెనుగొండ ఉపేంద్ర రావు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, ఉపాధ్యాయులు అనిత, శమీ ఉపాధ్యాయులు బోనాల వెంకటేశ్వరరావు. మెహబూబ్ అలీ, .వస్రం కె.చంద్రశేఖర్, వా.రామానుజ చార్యులు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొనినారు.

## ఖమ్మంలో ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

మహా అన్నదాన కార్యక్రమం




**నవగీతం: ఖమ్మం** ఖమ్మం కార్పొరేషన్లో కాలువ వడ్డాన తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ పంచాయతీరాజ్ శాఖ మంత్రి దానాసరి సీతక్క పుట్టినరోజు వేడుకలను వైరా కీ చెందిన కాంగ్రెస్ నాయకుడు చెరుకూరి కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి దాసరి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేద ప్రజల కోసం గిరిజనుల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు పోతున్న మంత్రి సీతక్క నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలి అని ప్రజలకు మరింత సేవలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైరా వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ,వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎందనూరి సీతారాములు, పొదిలి హరినాథ్ ,పాలేటి నరసింహారావు, మల్లు రామకృష్ణ ,అడుసుమిల్లి గణేష్ ,పెద్దప్రోలు లక్ష్మయ్య, పోలూరి సైదులు సాయి తదితరులు పాల్గొన్నారు

# బిజినెస్

## ఆరోగ్య బీమా చెల్లింపుల్లో కష్టం లేకుండా




ఆరోగ్య అత్యవసర పరిస్థితులు ఎప్పుడు ముంచుకొస్తాయో ఎవరూ ఊహించలేరు. ఇలాంటప్పుడు ఆసుపత్రి ఖర్చుల భారం లేకుండా ఆరోగ్య బీమా ఒక రక్షణ కవచంలా నిలుస్తుంది. ఆసుపత్రి బిల్లులను బీమా సంస్థే నేరుగా చెల్లించే నగదు రహిత (క్యాష్‌లెస్) సదుపాయం పాలసీదారులకు ఎంతో మేలు. ఆసుపత్రితో ముందే కుదుర్చుకున్న ఒప్పందం వల్ల అక్కడి బీమా డెస్క్.. క్లెయింకు సంబంధించిన అన్ని బాధ్యతలనూ తీసుకుంటుంది. మనం వెళ్లిన ఆసుపత్రి బీమా సంస్థ నెట్‌వర్క్ పరిధిలో లేనప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని ఆసుపత్రికి వెళ్లినప్పుడు.. బిల్లులు ముందుగా మనం చెల్లించి తర్వాత క్లెయిం చేసుకోవడం (రీయింబర్స్‌మెంట్) అనివార్యమవుతుంది. తమ దగ్గరలో ఉన్న ఆసుపత్రి తాము తీసుకున్న పాలసీ నెట్‌వర్క్‌లోనే ఉంటుందనే చాలామంది అనుకుంటారు. కానీ, అన్ని సందర్భాల్లోనూ ఇది వాస్తవం కాకపోవచ్చు. ఆ ఆసుపత్రి బీమా సంస్థ పరిధిలో లేకపోవచ్చు. కొన్నిసార్లు క్యాష్‌లెస్ ఆమోదానికి 3 నుంచి 4 గంటల సమయం పడుతుంది. అంత సమయం వేచి చూడటం ఇష్టం లేక బిల్లులు ముందే చెల్లించి, తర్వాత క్లెయిం చేసుకుంటారు కొందరు. మరికొన్నిసార్లు.. మోసం జరిగినట్లు అనుమానించినా, ముందస్తు వ్యాధులకు సంబంధించిన సమాచారం దాచినా, వేచి ఉండే సమయంలో అనారోగ్య సమస్యల కారణంగా క్యాష్‌లెస్ క్లెయింలను తిరస్కరించొచ్చు. ఒక్కోసారి వైద్యుల వివరణ లేదా అదనపు వైద్య సమాచారాన్ని కోరినప్పుడు అనుమతులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. నగదు రహిత విధానంలో బీమా సంస్థలు ఆసుపత్రులతో ముందుగా కుదుర్చుకున్న ప్యాకేజీ ధరలపైనే బిల్లులను చెల్లిస్తాయి. అదే రోగులు నేరుగా సొంత డబ్బులు చెల్లించేటప్పుడు, ఆసుపత్రులు సాధారణ రేట్లను వసూలు చేయడం వల్ల పాలసీదారునిపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. నెట్‌వర్క్ పరిధిలో లేని ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నప్పుడు, ఆ చికిత్స అవసరమైనదేనా, బిల్లులు సహేతుకంగా ఉన్నాయా అని బీమా సంస్థలు ప్రతి వివరాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. దీనివల్ల సమయం వృథా కావడంతోపాటు, పత్రాలు పూర్తి స్థాయిలో లేకుంటే పాక్షికంగా మాత్రమే క్లెయిం చెల్లించొచ్చు, పూర్తిగా తిరస్కరించొచ్చు.

### పాలసీదారుడిదే బాధ్యత

రీయింబర్స్‌మెంట్‌లో దరఖాస్తులను పూర్తి చేయడం, పత్రాలన్నింటినీ సేకరించి సమర్పించే బాధ్యత పూర్తిగా పాలసీదారునిదే. పత్రాలు సక్రమంగా ఉంటే, సాధారణంగా 7 నుంచి 10 రోజుల్లో క్లెయిం పరిష్కారమవుతుంది. గరిష్ఠంగా 30 రోజులు పట్టొచ్చు. ఈ లోపు బీమా సంస్థ ఏవైనా సందేహాలు లేవనెత్తితే ఆసుపత్రికి, బీమా సంస్థకు మధ్య తిరగాల్సి వస్తుంది. చేతిలో తగినంత నగదు లేక క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాల ద్వారా బిల్లులు చెల్లించిన వారికి ఈ ఆలస్యం వల్ల వడ్డీల భారం పెరిగి మరింత ఆర్థిక నష్టం వాటిల్లుతుంది.

## కార్పొరేట్ అగ్రపీఠంపై మిలీనియల్స్ జైత్రయాత్ర!




భారతీయ కార్పొరేట్ కంపెనీల్లో సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా అత్యున్నత నిర్ణయాధికారాలు కలిగిన 'సీ-సూట్' వంటి కీలక పదవులు) స్థానాలను యువత వేగంగా చేజిక్కించుకుంటోంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి ఎగ్జిక్యూటివ్‌లలో మిలీనియల్స్ (యువతరం) ఏకంగా 55 శాతం వాటాతో అతిపెద్ద లీడర్‌షిప్ గ్రూప్‌గా అవతరించారు. ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్‌ఇన్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. గత ఏడేళ్లలో సీ-సూట్ విభాగంలో మిలీనియల్స్ ప్రాతినిధ్యం 14.5 శాతం పెరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వ్యాపార నిర్ణయాలను శాసిస్తున్న తరుణంలో ఈ మార్పు ప్రాధాన్యత సంతరించుకుంది.

### మారుతున్న కెరీర్ ముఖచిత్రం

గతంలో ఒకే పరిశ్రమలో ఏళ్ల తరబడి పనిచేసిన అనుభవం ఉన్నవారికే లీడర్‌షిప్ పాత్రలు దక్కేవి. కానీ ఇప్పుడు ఆ ట్రెండ్ మారింది. సీ-సూట్ నాయకుల్లో ఒకే పరిశ్రమకు పరిమితమైన వారి సంఖ్య గతంలో 80 శాతం ఉండగా ఇప్పుడది 58 శాతానికి పడిపోయింది. అంటే.. వివిధ సంస్థలు, విభిన్న రకాల వ్యాపారాలు, మల్టిపుల్ ఫంక్షన్స్‌లో అనుభవం ఉన్నవారికే కంపెనీలు పట్టం కడుతున్నాయి.

మరోవైపు, ఏఐ రాకతో కార్పొరేట్ రంగంలో కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతోందని 84 శాతం మంది లీడర్లు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్లు (సీఎంఓ) అత్యధికంగా 94 శాతంతో ఈ మార్పును బలంగా నమ్ముతున్నారు. అంతేకాదు, వ్యాపార నిర్ణయాలు తీసుకోవడంలో 84 శాతం మంది లీడర్లు ఏఐ టూల్స్ ఇచ్చే ఇన్‌పుట్స్‌ను కీలకంగా వాడుతుండటం గమనార్హం.

### మార్కెట్ కంటే వేగంగా నేర్చుకోవాలి!

'భారత కార్పొరేట్ నాయకత్వం ఇప్పుడు అత్యంత సవాలుతో కూడిన దశలోకి ప్రవేశించింది. ఏఐ యుగంలో పాత రూల్ బుక్స్ కాలంచెల్లుతుంది. స్పష్టమైన రోడ్ మ్యాప్ లేకపోయినా లీడర్లు వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో వ్యాపార వ్యూహాలకు సాంకేతికత, ప్రతిభను జోడిస్తున్నవారే సఫలమవుతున్నారు. మార్కెట్ మారుతున్న వేగంతో సమానంగా లీడర్లు నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలి' అని లింక్డ్‌ఇన్ ఇండియా కంట్రీ మేనేజర్ కుమారేష్ పట్టాభిరామన్ తెలిపారు.

### వేగం పెంచాలనే ఒత్తిడి

టెక్నాలజీ మారుతున్న వేగానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం ఇప్పుడు లీడర్లకు పెద్ద పరీక్షగా మారింది. దాదాపు ఐదింటిలో నలుగురు (79%) సీ-సూట్ లీడర్లు.. ఏఐ వల్ల కలిగే పూర్తి ఫలితాలను అంచనా వేయడానికి ముందే దానిని వ్యాపారాల్లో వేగంగా అమలు చేయాలనే ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ ఒత్తిడి సీఎంఓల్లో 82 శాతం, సీటీఓల్లో 81 శాతంగా ఉంది. అలాగే, తీవ్రమైన అనిశ్చితి మధ్య అత్యంత వేగంగా నిర్ణయాలు తీసుకోవడమే తమ ముందున్న అతిపెద్ద సవాలని 39 శాతం మంది లీడర్లు (ముఖ్యంగా 46% మంది సీఎంఓలు, 43% మంది సీఈఓలు) అంగీకరిస్తున్నారు.

## ఆర్‌బీఐ కొత్త సర్వేలు.. ఎందుకో తెలుసా?




ద్రవ్య విధాన రూపకల్పనకు కీలకమైన సమాచారాన్ని అందించే లక్ష్యంతో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూడు సర్వేలను ప్రారంభించింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. ద్రవ్యోల్బణ అంచనాలు, గ్రామీణ, పట్టణ ప్రజల ఆర్థిక పరిస్థితిపై అభిప్రాయాలను తెలుసుకోవడం ఈ సర్వేల ప్రధాన ఉద్దేశ్యం. భవిష్యత్ ద్రవ్య విధాన నిర్ణయాలు తీసుకునే సమయంలో.. ఈ సర్వేల ద్వారా లభించే సమాచారం ఆర్‌బీఐకి చాలా ఉపయోగపడనుంది. ఆర్‌బీఐ ప్రారంభించిన సర్వేలలో ఒకటి 'కుటుంబాల ద్రవ్యోల్బణ అంచనాల సర్వే'. ఈ సర్వే ద్వారా ప్రజలు భవిష్యత్‌లో ధరల పెరుగుదలను ఎలా అంచనా వేస్తున్నారో తెలుసుకోనున్నారు. ఈ సర్వేను దేశంలోని 19 నగరాల్లో నిర్వహించనున్నారు. ప్రజలు తమ రోజువారీ వినియోగ అలవాట్లు, ఖర్చుల ఆధారంగా వివిధ వస్తువులు, సేవల ధరల్లో మార్పులు ఎలా ఉండవచ్చని భావిస్తున్నారో ఇందులో నమోదు చేస్తారు. రాబోయే మూడు నెలల్లో, అలాగే ఒక సంవత్సరం కాలంలో సాధారణ ధరల పరిస్థితి ఎలా ఉండొచ్చనే అంశంపై కుటుంబాల అభిప్రాయాలను సేకరిస్తారు. ఆహారం, ఇతర వినియోగ వస్తువులు వంటి నిర్దిష్ట ఉత్పత్తుల ధరలపై కూడా ప్రజల అంచనాలను తెలుసుకుంటారు. దీంతో పాటు ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణ స్థాయి, వచ్చే మూడు నెలలు.. ఏడాదిలో ఉండే అవకాశం ఉన్న ద్రవ్యోల్బణంపై పరిమాణాత్మక వివరాలను కూడా సేకరించనున్నారు.

### రూరల్ కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వే

ఆర్‌బీఐ మరో సర్వే పేరు 'రూరల్ కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వే'. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ప్రజల ఆర్థిక పరిస్థితిపై ఉన్న అభిప్రాయాలను తెలుసుకోవడం ఈ సర్వే లక్ష్యం. దేశంలోని 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ సర్వే నిర్వహించనున్నారు. ఇందులో ప్రజల ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, భవిష్యత్‌పై వారి అంచనాలను నమోదు చేస్తారు. ప్రధానంగా దేశ ఆర్థిక పరిస్థితి, ఉద్యోగ అవకాశాలు, ధరల స్థాయి, కుటుంబ ఆదాయం, ఖర్చులపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ ధోరణులు ఎలా మారుతున్నాయో తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది.

### అర్బన్ కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వే

అర్బన్ కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వేను కూడా ఆర్‌బీఐ ప్రారంభించింది. పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు దేశ ఆర్థిక పరిస్థితిని ఎలా చూస్తున్నారు? భవిష్యత్‌పై వారి అంచనాలు ఏమిటి? అనే అంశాలను తెలుసుకోవడం దీని ఉద్దేశ్యం.

ఈ సర్వేలో ఆర్థిక పరిస్థితి, ఉద్యోగ అవకాశాలు, ధరల స్థాయి, కుటుంబ ఆదాయం, ఖర్చులపై పట్టణ కుటుంబాల అభిప్రాయాలను సేకరిస్తారు. ద్రవ్యోల్బణ అంచనాల సర్వే మాదిరిగానే ఈ సర్వేను కూడా 19 నగరాల్లో నిర్వహించనున్నారు. ఇందులో అహ్మదాబాద్, బెంగళూరు, చండీగఢ్, చెన్నై, ఢిల్లీ, ముంబై, తిరువనంతపురం వంటి ప్రధాన నగరాలు ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం, ప్రజల ఖర్చు ధోరణులు, వినియోగదారుల విశ్వాసం వంటి అంశాలు చాలా ముఖ్యమైనవి. వడ్డీ రేట్లను నిర్ణయించడం, ద్రవ్య సరఫరాను నియంత్రించడం వంటి కీలక నిర్ణయాలకు ఆర్‌బీఐ ఈ సమాచారాన్ని ఉపయోగిస్తుంది. ప్రజలు ధరల పెరుగుదలను ఎలా అంచనా వేస్తున్నారు? వారి ఆదాయం, ఖర్చుల పరిస్థితి ఎలా ఉంది? ఆర్థిక వ్యవస్థపై వారి నమ్మకం ఎంతవరకు ఉంది? వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన రావడం ద్వారా ఆర్‌బీఐ మరింత సమర్థవంతమైన ద్రవ్య విధానాలను రూపొందించగలదు.

## నాలుగో టీ20లో ఇంగ్లాండ్ విజయం..

# సిరీస్‌ను కోల్పోయిన భారత్

బ్రిస్టల్: టీ20ల్లో ప్రపంచ ఛాంపియన్‌గా ఉన్న భారత్‌కు మరో షాక్. మొన్న ఐర్లాండ్ చేతిలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒక్క మ్యాచ్ గెలవకుండా ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్న టీమ్‌ఇండియా.. ఇప్పుడు ఇంగ్లాండ్‌పై కూడా సిరీస్‌ను కోల్పోయింది. భారత్‌తో జరిగిన నాలుగో టీ20లో ఇంగ్లాండ్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆతిథ్య జట్టు ఐదు టీ20ల సిరీస్‌ను 3-0తో ఒక మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 13.5 ఓవర్లలోనే ఒకే వికెట్ కోల్పోయి ఛేదించింది. జోస్ బట్లర్ (8) త్వరగానే ఔటైనా.. తర్వాత వచ్చిన హ్యారీ బ్రూక్ (79లి; 35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. ఫిల్ సాల్ట్ (59లి; 42 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. టీమ్‌ఇండియా బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (80లి; 49 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒక్కడే రాణించాడు. వైభవ్ సూర్యవంశీ (15), అభిషేక్ శర్మ (16), శివమ్ దూబె (22), తిలక్ వర్మ (11), ఇషాన్ కిషన్ (4) నిరాశపర్చారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 2, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ ఒక్కో వికెట్ పడగొట్టారు. నామమాత్రపు ఐదో టీ20 శనివారం సౌథాంప్టన్‌లో జరగనుంది. భారత్‌తో రెండు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌లు ఉన్న ద్వైపాక్షిక టీ20 సిరీస్‌ను ఇంగ్లాండ్ కైవసం చేసుకోవడం ఇదే తొలిసారి. 159 పరుగుల లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్ బ్యాటర్లు దూకుడుగా ఆడేస్తున్నారు. ముఖ్యంగా హ్యారీ బ్రూక్ బౌండరీలతో విరుచుకుపడుతున్నాడు. వాషింగ్టన్ సుందర్ వేసిన ఎనిమిదో ఓవర్‌లో అతను వరుసగా 4, 6, 4, 4 బాదేశాడు. తర్వాత అక్షర్ పటేల్ బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ రాబట్టాడు. ఈ క్రమంలోనే 21 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. శివమ్ దూబె వేసిన పదో ఓవర్‌లో కూడా బ్రూక్ రెండు ఫోర్లు కొట్టాడు. దీంతో 10 ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లాండ్ స్కోరు 120/1. బ్రూక్ (59), ఫిల్ సాల్ట్ (41) పరుగులతో ఉన్నారు. భారత్‌తో జరుగుతున్న నాలుగో టీ20లో ఇంగ్లాండ్ బ్యాటర్లు పుంజుకున్నారు. గత మూడు ఓవర్లలో ఆ జట్టు 40 పరుగులు చేసింది. ప్రిన్స్ యాదవ్ వేసిన నాలుగో ఓవర్ 15 పరుగులు వచ్చాయి. తర్వాత ప్రసిద్ధ్ వేసిన ఓవర్‌లో ఫిల్ సాల్ట్ మూడు ఫోర్లు బాదాడు. పవర్ ప్లే ముగిసేసరికి ఇంగ్లాండ్ స్కోరు 62/1. బ్రూక్ (18), ఫిల్ సాల్ట్ (26) పరుగులతో ఉన్నారు. ఇంగ్లాండ్‌తో నాలుగో టీ20లో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ తొలి రెండు ఓవర్లలో కలిపి ఏడు పరుగులే ఇచ్చారు. అర్ష్‌దీప్ వేసిన మూడో ఓవర్‌లో సిక్స్ కొట్టిన జోస్ బట్లర్ (8) తర్వాత బంతికే వికెట్‌కీపర్ ఇషాన్‌కు క్యాచ్ ఇచ్చాడు. 3 ఓవర్లకు స్కోరు 22/1. హ్యారీ బ్రూక్ (8) పరుగులతో ఉండగా.. ఇప్పటివరకు ఏడు బంతులు ఎదుర్కొన్న ఫిల్ సాల్ట్ పరుగుల ఖాతా తెరవలేదు. ఇంగ్లాండ్ టార్గెట్ 159. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగో టీ20లో టీమ్‌ఇండియా బ్యాటింగ్ ముగిసింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (80లి; 49 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. వైభవ్ సూర్యవంశీ (15), అభిషేక్ శర్మ (16), శివమ్ దూబె (22), తిలక్ వర్మ (11), ఇషాన్ కిషన్ (4) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 2, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ హాఫ్ సెంచరీ చేశాడు. 15 ఓవర్లకు జట్టు స్కోరు 116/4. శ్రేయస్ (52లి), తిలక్ వర్మ (3లి) క్రీజులో ఉన్నారు. విల్ జాక్స్ వేసిన 11వ ఓవర్‌లో శ్రేయస్ సిక్స్ సహా 10 పరుగులు వచ్చాయి. 12వ ఓవర్‌లో సామ్ కరన్ 6 పరుగులు ఇచ్చాడు. 13వ ఓవర్‌లో శివమ్ దూబె ఫోర్ బాదాడు. మొత్తం 7 పరుగులు వచ్చాయి. 13.5 ఓవర్‌లో భారత్ నాలుగో వికెట్ కోల్పోయింది. విల్ జాక్స్ బౌలింగ్‌లో శివమ్ దూబె (22) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. 15వ ఓవర్‌లో సిక్స్‌తో శ్రేయస్ తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్‌లో 13 పరుగులు వచ్చాయి.

10 ఓవర్ల నాటికి భారత్ 71/3 స్కోరు చేసింది. శ్రేయస్ అయ్యర్ (24లి), శివమ్ దూబె (10లి) క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేస్తున్నారు. సామ్ కరన్ వేసిన ఆరో ఓవర్‌లో శ్రేయస్ ఓ ఫోర్ బాదాడు. మొత్తం ఏడు పరుగులు వచ్చాయి. 6.4 ఓవర్‌లో భారత్ మూడో వికెట్ కోల్పోయింది. ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ (16) ఔటయ్యాడు. 8వ ఓవర్‌లో శ్రేయస్ ఓ సిక్స్ బాదాడు. తొమ్మిదో ఓవర్‌లో 6 పరుగులు, పదో ఓవర్‌లో 7 పరుగులు వచ్చాయి.




5 ఓవర్లకు భారత్ స్కోరు 37/2. అభిషేక్ శర్మ (13లి), శ్రేయస్ అయ్యర్ (4లి) క్రీజులో ఉన్నారు. జోఫ్రా ఆర్చర్ వేసిన తొలి ఓవర్‌లో వైడ్ సహా 5 పరుగులు వచ్చాయి. రెండో ఓవర్ జోష్ టంగ్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మ ఫోర్, వైభవ్ సూర్యవంశీ ఫోర్, సిక్స్ బాదాడు. మొత్తం 15 పరుగులు వచ్చాయి. 2.4 ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో భారత్‌కు తొలి షాక్ తగిలింది. వైభవ్ సూర్యవంశీ (15) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఈ ఓవర్‌లో 4 పరుగులే వచ్చాయి. 4వ ఓవర్‌లో అభిషేక్ శర్మ ఫోర్ కొట్టాడు. ఈ ఓవర్‌లో విల్ జాక్స్ 8 పరుగులు ఇచ్చాడు. 4.2 ఓవర్‌లో జోష్ టంగ్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ (4) ఔటయ్యాడు. ఈ ఓవర్‌లో 5 పరుగులు వచ్చాయి. భారత్, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టీ20 మ్యాచ్ జరగనుంది. టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఇప్పటికే ఇంగ్లాండ్ ఈ సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉంది. సిరీస్ చేజారకుండా ఉండాలంటే భారత్ ఈమ్యాచ్‌లో తప్పక నెగ్గాల్సి ఉంది. భారత్ తుది జట్టు: అభిషేక్ శర్మ, వైభవ్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, దూబె, సుందర్, అక్షర్ పటేల్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ. ఇంగ్లాండ్: సాల్ట్, బట్లర్, బ్రూక్, బెతెల్, బాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, రెహాన్, అదిల్ రషీద్, ఆర్చర్, జోష్ టంగ్. ఇంగ్లాండ్ తుది జట్టు: ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్ (వికెట్‌కీపర్), హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెతెల్, టామ్ బాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

### టీ20 సిరీస్‌కు.. వరుణ్, హర్షిత్ దూరం

ఇంగ్లాండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు (నాలుగు, ఐదో టీ20లు) వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా దూరమయ్యారు. వారిద్దరూ ఇటీవల జరిగిన మ్యాచ్‌లో గాయాల పాలవడంతో జట్టు మేనేజ్‌మెంట్ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. నేడు జరుగుతున్న నాలుగో టీ20

# స్పోర్ట్స్

## గాఫ్‌పై సంచలన విజయం.. తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో ముచోవా..!



వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో కరోలినా ముచోవా సంచలన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో ఏడో సీడ్ కొకో గాఫ్(జశీషశీ +ఘబటట)ను చిత్తు చేసిన ముచోవా తొలిసారి వింబుల్డన్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. గురువారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో గాఫ్‌పై ఆధిపత్యం చెలాయించిన చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి.. నిర్ణయాత్మక మూడో సెట్‌లో గెలుపొందింది. దాంతో, మొదటిసారి ఆల్ ఇంగ్లండ్ క్లబ్ టోర్నీలో విజేతగా నిలవాలనుకున్న అమెరికా స్టార్ గాఫ్ కల చెదిరింది. గ్రాండ్‌స్లామ్ టోర్నీ వింబుల్డన్‌లో కరోలినా ముచోవా ఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం జరిగిన థ్రిల్లింగ్ సెమీస్‌లో కొకో గాఫ్‌ను ఓడించిన ముచోవా తొలిసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. తొలి సెట్ నుంచే దూకుడుగా ఆడిన ముచోవా.. 6-2తో గాఫ్‌కి షాకిచ్చింది. అయితే.. రెండో సెట్‌లో పుంజుకున్న అమెరికా టెన్నిస్ స్టార్ 6-1తో పైచేయి సాధించింది. కానీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో ముచోవా చెలరేగిపోయింది. ఒకదశలో ఇద్దరూ 10-10 పాయింట్లతో సమంగా నిలిచినా చెక్ రిపబ్లిక్ ప్లేయర్ ధాటికి గాఫ్ చేతులెత్తేసింది. ఉత్కంఠ రేపిన టై బ్రేక్‌ను 7-6తో గెలచుకున్న ముచోవా ఏడో సీడ్‌ను ఇంటికి పంపింది. రెండో సెమీస్‌లో ఆడుతున్న మార్టా కొత్సుక్, లిండా నొస్కోవాలో ఒకరితో ముచకోవా

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
10 జూలై 2026

## పెళ్లి తర్వాత తిరుపతికి.. నిధి అగర్వాల్ కామెంట్స్



ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. గత కొన్నాళ్లలో చూసుకుంటే రష్మిక, సమంత తదితరుల వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఓ పక్క సినిమాలు చేసుకుంటూ మరోవైపు ఫ్యామిలీ లైఫ్ కూడా ఎంజాయ్ చేస్తున్నారు. ఇప్పుడీ లిస్టులో టాలీవుడ్ హీరోయిన్ నిధి అగర్వాల్ కూడా చేరేలా కనిపిస్తోంది. తాజాగా తన పెళ్లి గురించి హింట్ ఇచ్చేలా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఓ మొబైల్ స్టోర్ ఓపెనింగ్ కోసం తాజాగా తిరుపతిలో సందడి చేసిన నిధి అగర్వాల్.. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'పెళ్లి తర్వాత తిరుపతికి వస్తాను. ప్రస్తుతానికి వివాహం గురించి ప్లాన్స్ ఏం లేవు. ఇంకా పెళ్లి కొడుకు దొరకలేదు. ప్రస్తుతం హిందీ, తెలుగులో తలో రెండు సినిమాలు చేస్తున్నాను' అని చెప్పుకొచ్చింది. నిధి అగర్వాల్ కెరీర్ విషయానికొస్తే.. హిందీలో తొలుత హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో అయితే సవ్యసాచి, మిస్టర్ మజ్ను, ఇస్మార్ట్ శంకర్, రాజాసాబ్, హరిహర వీరమల్లు తదితర మూవీస్ చేసింది. కానీ వీటిలో 'ఇస్మార్ట్ శంకర్' తప్పితే ఈమెకు మరో సక్సెస్ అనేది లేకుండా పోయింది. గతేడాది రిలీజైన హరిహర వీరమల్లు, ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన రాజాసాబ్ చిత్రాలపై బోలెడన్ని ఆశలు పెట్టుకుంది కానీ అవి డిజాస్టర్స్ అయ్యాయి. చూస్తుంటే త్వరలో పెళ్లి వార్త ఏమైనా చెబుతుందేమో?

## అవినీతిపరులకు సింహస్వప్నం



అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'చీదీఖ 111'(వర్కింగ్ టైటిల్)లో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు కూడా వచ్చాయి. తన లేటెస్ట్ ఇంటర్వ్యూలో ఆ పాత్ర గురించి కాజల్ మాట్లాడారు. బాలకృష్ణ 'నేలకొండ భగవంత్ కేసరి' సినిమాలో ఫన్నీగా కనిపించిన తాను, 'చీదీఖ 111'లో మాత్రం సీరియస్ పాత్ర పోషిస్తున్నట్టు ఆ ఇంటర్వ్యూలో కాజల్ పేర్కొన్నారు. చీవషం ఫిల్మ్‌వర్గాల సమాచారం ప్రకారం ఇందులో ఆమె నిజాయతీ గల ప్రభుత్వ అధికారిగా కనిపిస్తుందట. అవినీతిపరుల గుండెల్లో వణుకు పుట్టించేలా ఆ పాత్ర సాగుతుందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్ సీన్స్ భావోద్వేగపూరితంగా ఉంటాయట. కాజల్ కెరీర్‌లో ఇప్పటివరకూ కనిపించని భిన్నమైన పాత్ర ఇదని తెలుస్తున్నది. నిజానికి ఈ పాత్రకు ముందు నయనతారను అనుకున్నారు. కానీ కొన్ని కారణాలవల్ల ఆమె స్థానంలో కాజల్ వచ్చి చేరింది. మలినేని గోపీచంద్ దర్శకత్వంలో వెంకటసతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



## 'వదలా' సినిమా మిమ్మల్ని వదలదు

ప్రముఖ నటుడు జగపతిబాబు లీడ్ రోల్ పోషిస్తున్న సస్పెన్స్ ఫ్యామిలీ థ్రిల్లర్ 'వదలా'. లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రధారులు. ఆకెళ్ల .వి కృష్ణ దర్శకుడు. కిశోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మాతలు. ఈ నెల 17న సినిమా విడుదల కానున్నది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. 'చాలా రోజుల తర్వాత నేను సోలోగా చేసిన సినిమా ఇది. ఈ థ్రిల్లర్ సినిమాలో నాకు ఇద్దరు హీరోయిన్లు కూడా ఉన్నారు. 'వదలా' అనేది క్యాచీ టైటిల్. ఈ సినిమా కథపై నాకు అపారమైన నమ్మకం. టైటిట్‌కి తగ్గట్టే ఈ సినిమా మిమ్మల్ని వదలదు.వీశీజఱవం ఇది మంచి ఫ్యామిలీ థ్రిల్లర్. అలాగే మంచి డ్రామా కూడా ఉంది. తప్పకుండా సినిమా అందర్నీ అలరిస్తుంది' అని జగపతిబాబు నమ్మకం వెలిబుచ్చారు. జగపతిబాబుతో మళ్లీ నటించడం పట్ల నటి లయ ఆనందం వ్యక్తం చేశారు. తమ సంస్థలో ఎన్నో చిత్రాలు నిర్మించామని, తొలిసారి థ్రిల్లర్ చేశామని, ఆదరిస్తారని నమ్మకంతో ఉన్నామని నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ అన్నారు. ఈ సినిమాకు కర్త, కర్మ, క్రియ మొత్తం జగపతిబాబేనని, ప్రాణం పెట్టి ఈ సినిమా చేశారని, కథ, కథనం, విషయాల్లోనే కాక, సాంకేతికంగా కూడా సినిమా అందర్నీ ఆకట్టుకుంటుందని దర్శకుడు ఆకెళ్ల వి.కృష్ణ నమ్మకంగా చెప్పారు. ఇంకా హృతికా శ్రీనివాస్ కూడా మాట్లాడారు.



## డిసెంబర్‌తో బన్నీ పార్ట్ పూర్తి?

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ 'రాకా' షూట్‌లో బిజీగా ఉన్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం హైదరాబాద్ కేంద్రంగా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇందులో విభిన్న కోణాలతో కూడిన పాత్రను బన్నీ పోషిస్తున్నారు. సైన్స్‌ఫిక్షన్ నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో దీపిక పదుకోన్ కథానాయిక. మృణాల్‌ఠాకూర్, జాన్వీ కపూర్ ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నట్టు సమాచారం. ఇటీవలే విడుదలైన తోడేలు చేతులతో కూడిన బన్నీ ఫస్ట్‌లుక్ ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ కథతో తోడేలుకు ఉన్న సంబంధం అంతర్జాతీయ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇదిలావుంటే.. ముందుగా అనుకున్న ఒప్పందం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్‌లో ఈ సినిమాలోని అల్లు అర్జున్ పార్ట్ మొత్తం అట్లీ పూర్తి చేయనున్నారు. సన్ పిక్చర్స్ 800కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న 'రాకా' చిత్రం 2027 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. జనవరి నుంచి లోకేష్ కనకరాజ్ సినిమా సెట్‌లోకి బన్నీ ఎంట్రీ ఇస్తారని ఇన్‌సైడ్ టాక్.

## రష్మిక అరుదైన ఫీట్

'మైసా' సినిమా కోసం తీవ్రంగా శ్రమిస్తున్నది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ధైర్యసాహసాలు మూర్తీభవించిన గిరిజన మహిళగా ఆమె కనిపించనున్న విషయం తెలిసిందే. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పోరాట ఘట్టాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని చెబుతున్నారు. ఈ సినిమా కోసం బ్యాంకాక్‌లో మార్షల్ ఆర్ట్స్‌లో ట్రెయినింగ్ తీసుకుంది రష్మిక మందన్న. డూప్‌లేకుండా స్వయంగా పోరాట ఘట్టాల్లో పాల్గొన్నది. తాజాగా ఆమె భారతీయ సినిమాలో ఇప్పటివరకూ ఎవరూ చేయని ఓ అరుదైన ఫీట్‌ని సొంతం చేసుకుంది. 'మైసా' కోసం రెండు రోజుల్లో దాదాపు 20 గంటల పాటు అత్యంత క్లిష్టమైన అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. వీటిలో డూప్ లేకుండా రష్మిక స్వయంగా పాల్గొన్నది. లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో కథానాయిక సొంతంగా చేసిన తొలి అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్ ఇదే కావడం విశేషం. సన్నివేశాల్లో సహజత్వం కోసం రష్మిక స్వయంగా అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్స్ చేసిందని, సినిమా పట్ల ఆమె అంకితభావానికి ఇదొక నిదర్శనమని మేకర్స్ పేర్కొన్నారు. త్వరలో ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాహుల్ రవీంద్రన్, ఈశ్వరీరావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాణం: అన్‌ఫార్ములా ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రవీంద్ర పుల్లె.



Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.